ప్రజాశక్తి

Vol. 7, no. 7

(Aug. 15, 1945)

బెజవాడ, 1945

Record no. 683

Prajāśakti

Vol. 7, no. 7

(Aug. 15, 1945)

Bejavāḍa, 1945

Record no. 683

Regd. No M. 4486 0-2-0

ప్రజాశక్తి

సంపుటి 7 బుధవారం 15-8-45 సంచిక 7

జపాను దురాక్రమణ చరిత్ర

"ఉదయభానుధ్వజం" నేలకొరుగుతూంది. తోడిదొంగలతో కలిసి ప్రపంచాధిపత్యంకోసం బయలుదేరిన ముష్కర ఫాసిస్టురాజ్యం 'ప్రజాపక్షానికి' తలవొగ్గింది. జపాను మిత్రరాజ్యాలకు శరణాగతి అంది. ఏక్షణంలోనయినా తుదిప్రకటన జరుగుతుంది.

ప్రపంచ ప్రజలందరూ ఈవార్త విని పరమానందభరితులయారు. లండను నగరవీధులు నృత్యగానాలలో మునిగితేలాయి. వాషింగ్టన్‌నగరం ప్రజల జయజయ ధ్వానాలతో మారుమోగింది. ఇదంతాకలిసి ఒకఎత్తు-చుంకింగున ప్రజల పండుగ ఒక్కటీ ఒకఎత్తు.

14 ఏళ్ళ క్రితం

ఈనాడు సమాప్తమవుతూన్న ఈ మారణహోమం 14 ఏళ్ళక్రితం చైనాలో రగిలింది.

నల్లమందు నిషాలో మునిగి, తరతరాలుగ పడిఉన్న చైనా కళ్ళువిప్పి, అప్పుడే మేల్కొంటున్న రోజులవి. దురాశాపరులైన విదేశీయుల కుయుక్తులపాలబడి చైనా రూపుమాసింది. బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు, జర్మనీ, జపానులు కీలకస్థానాల్లో ప్రత్యేకస్థావరాలేర్పచుకొని, వాటిలో సర్వాధికారాలు తమవే అన్నారు. నోరెత్తలేకపోయింది చైనా. చైనాలో ఈదేశాలవారు ఏనేరం చేసినా విచారించగల అధికారం చైనాకు లేదన్నారు - ఆ అధికారం తమదేనన్నారు. మారు మాటాడలేక పోయింది చైనా. నల్లమందు దొంగవ్యాపార రక్షణకోసం పశుబలంప్రయోగించి, చైనాను నిర్వీర్యంచేసి, ఆర్థిక, రాజకీయ జీవితాన్నంతా తమ గుప్పిట్లోకి తెచ్చుకొని, చివరకు దానిని ఈ దీనావస్థకు తెచ్చారు.

అంతేకాదు: వేలకొలది అభాగ్య చైనీయులను ఎత్తుకుపోయి, ఇతరదేశాల్లో బానిసలుగ అమ్మేవారు. ఈ అమానుష చర్యలను ఖండిస్తూ 1852లో అమోయ్‌లో చైనావా[illegible]క ప్రదర్శనంచేస్తే, బ్రిటిషు నౌకాబలంవచ్చి వారిని చిత్రవధచేసింది. పేరుకి చైనా స్వతంత్ర దేశమేకాని, నిజానికి ఈ రాజ్యాలన్నిటియొక్క వలసదేశంగా ఉండేది. విదేశాల్లో విద్యాభ్యాసంకోసం వెళ్ళిన యువకులు, వ్యాపారంకోసం దూరప్రదేశాలకు ప్రయాణాలు సాగించే వర్తకులు- ఆ దేశాల్లో స్వాతంత్ర్యంయొక్క మాధుర్యాన్ని రుచిచూచారు. తమ మాతృదేశంయొక్క నికృష్టదశను మరింత స్పష్టంగా గ్రహించగలిగారు. స్వాతంత్ర్య దీక్ష వారిలో తలెత్తింది. దివ్యమూర్తి డాక్టరు సన్‌యట్‌సేన్ వీరికి నాయకత్వం వహించాడు. 1894 లో రహస్యంగా స్వాతంత్ర్యోద్యమం ప్రారంభించాడు. 1911 నాటికది 'కొమింటాంగు' పార్టీగా అభివృద్ధి పొందింది.

ఈ ఉద్యమం 1912లో చక్రవర్తిచేత రాజీనామాయిప్పించింది. కాని, చక్రవర్తి అనుచరులే తిరిగి ప్రభువులయారు. ప్రజాఉద్యమాన్ని అణచసాగారు. అందుకోసం దేశంలో వున్న విదేశీయులపై ఆధారపడసాగారు. దేశంలోని వ్యవహారాలు ఇంకా యెక్కువగా విదేశీయుల పలుకుబడి క్రిందకు పోయాయి. వీరు చైనా ప్రజల్ని నీచాతినీచంగా చూడసాగారు. మచ్చుకి చూడండి: షాంగ్‌హైలో ఒక పార్కుకి ఒక నోటీసు అంటించారు. "కుక్కలు, చైనీయులు లోనికి రాకూడదు" అని ఆ నోటీసు. పరువు మర్యాదలు గల జాతిగా తిరిగి చైనా ఎన్నటికైనా తలెత్తుతుందా! అనిపించేది ఆనాటివారికి.

సోవియట్ ప్రోత్సాహం

చైనా ఉన్నతదశకు రాగల అవకాశం ముమ్మాటికీ ఉన్నదని కొత్తగా ఏర్పడిన సోవియట్ ప్రభుత్వం గుర్తుకు తెచ్చింది. ఇతర విదేశీ ప్రభుత్వాలతోపాటు జారుచక్రవర్తి చైనాపై రుద్దిన అక్రమ సంధిషరతులను సోవియట్ ప్రభుత్వం రద్దుచేసింది. తనతోపాటు సరిసమాన హోదాగల చైనాను గుర్తించి, ఆనాటినుంచి చైనా ప్రజలకు - సోవియటుకు మైత్రి పెంపొందుతూవచ్చింది. డాక్టరు సన్‌యట్‌సేన్ లెనిన్‌కి మిత్రుడయాడు. చైనా పునర్నిర్మాణానికి చక్కని ప్రజాస్వామిక కార్యక్రమాన్ని డాక్టరు సన్‌యట్‌సేన్ ఇచ్చాడంటే సోవియట్ విప్లవంయొక్క ప్రభావం చాలవరకు కారణం. చైనా కొక చక్కని జాతీయ సైన్యాన్ని నిర్మించిపెట్టమని డాక్టర్ సన్‌యట్‌సేన్ యొక్క కొమింటాంగు పార్టీ సోవియట్‌ని కోరింది. సోవియట్ మిలిటరీ నిపుణులు చైనాయువకులకు తరిఫీదు నిచ్చారు. చైనా చరిత్రలో 'జాతీయ సైన్యం' నిర్మాణం కావడానికి అదేమొదటిసారి.

తా. పీ. మోహన్ రావు

ఆరోజుల్లోనే - 1921 లో - చైనాలో కమ్యూనిస్టుపార్టీ ఏర్పడింది. దీని నాయకత్వాన కార్మికులు, కర్షకులు, చైతన్యవంతులై కొమింటాంగు జాతీయోద్యమానికి చేయూతగ రాసాగారు.

ఏకరాజ్య స్థాపనకోసం -

ఈ వివిధ ప్రజాఉద్యమాల సహాయంతో, 'జాతీయ సైన్యం యొక్క బలంతో, చక్రవర్తి గులాముల, సజమీందారులను తొలగించి, యావత్తుచైనాను ఐక్యపరచి ఒకే ఒక ప్రజాస్వామిక ప్రభుత్వం చేతికిందకు తేడానికి 1926 లో కొమింటాంగుపార్టీ జైత్రయాత్ర ప్రారంభించింది. విదేశప్రభుత్వాలు కురిపిస్తున్న అవమానాల భారంతో కృంగిపోతూన్న చైనాను పరువుమర్యాదలు గల రాజ్యాంగా ప్రతిష్ఠించడానికి బయలుదేరింది. ఈ జైత్రయాత్రకు చాంగ్-కై-షేక్ నాయకత్వం వహించాడు. కమ్యూనిస్టుపార్టీ పూర్తిసహకారాన్నిచ్చింది. సోవియట్ సానుభూతిని ప్రకటించింది.

ఈజాతీయసైన్యానికి ఒకడుగు ముందుగా ప్రచారకదళాలు నడిచాయి. వెళ్ళినచోటల్లా ప్రజల్లో దేశాభిమానాన్ని రగుల్కొలిపి, సాగివస్తున్న సేనలకు దారి సిద్ధంచేశాయి. ఆ సేనలు ముందుకుసాగిన వెంటనే రైతులు తమ సంఘాలేర్పరచుకొని, జమిందారులను తరిమిగొట్టి, వారి రౌడీమూకలకు తగినశాస్తిచేశారు. కార్మికులు ముందుకువచ్చి ఎక్కువ జీతాలు మొదలైన హక్కులను పొందారు.

జపాను దురాక్రమణ

ఈవిధంగా చైనా జాతీయోద్యమం పెంపొందడం, దాని పలుకుబడికింద యావత్తు చైనా ఐక్యంకావడం - జపానుకేమాత్రం నచ్చలేదు. "అన్ని జాతుల్లోకి జపానుజాతి శ్రేష్ఠమయినది. యావత్తు ప్రపంచాన్ని పరిపాలించతగ్గది." అనే సిద్ధాంతాన్ని సృష్టించి, దాని కనుగుణ్యమైన కార్యక్రమాన్ని వేసిపెట్టిన టనాకామంత్రి నాయకత్వాన జపాను చైనా ఉద్యమాన్ని ప్రతిఘటించసాగింది. కొమింటాంగుపార్టీ నాన్‌కింగులో కేంద్రప్రభుత్వం స్థాపించింది. ఆప్రభుత్వం ఒకడుగు ముందుకు వేయజూచింది. నేరస్థులయిన విదేశీయులను శిక్షించడం విషయంలో అదివరకున్న షరతులను రద్దుచేయజూచింది. ఏదోఒకసాకుకోసం వేచివున్న జపాను వెంటనే దెబ్బతీసింది. 1931 సెప్టెంబరులో మంచూరియాపై దాడి ప్రారంభించింది.

ఈ దురాక్రమణను నాంకింగు ప్రభుత్వం ప్రతిఘటించలేకపోయింది. విదేశీ సలహాదారుల్నిచూస్తే, నానాజాతిసమితికి ఫిర్యాదుచేసుకోమన్నారు. అక్కడ బ్రిటిష్‌ప్రభుత్వం జపాను చర్యను సమర్థించింది. ఫ్రాన్సు బ్రిటనుకు వంతపాడింది. అటు ఈచర్చలు సాగుతూనేఉన్నాయి. ఇటు జపాను మంచూరియాను పూర్తిగ కబళించింది. మరికొద్ది నెలల్లోనే చైనాలోని జిహోల్‌రాష్ట్రాన్ని ఆక్రమించుకొని 'మంచూకో' (మంచూరియాకు జపాను పెట్టినపేరు)కు చేర్చింది.

దురాక్రమణకు బ్రిటన్ సహకారం

అంతవరకు ప్రజల సహకారంతో ముందుకు సాగిన 'కొమింటాంగు' జాతీయోద్యమం జపానును ఏమాత్రమూ ప్రతిఘటించలేకపోయింది. ఎందువల్ల? మంచూరియాను ఆక్రమించుకొని జపాను బలపడడం తమ హక్కులకు భంగమని తెలిసికూడా బ్రిటన్, ఫ్రాన్సులు జపాను చర్యను బలపరిచాయి. దీనికి కారణమేమిటి?

జాతీయోద్యమాన్ని ముందుకు తీసుకుపోతూ చెంగ్-కై-షేక్ సేనలు ఎలా జైత్రయాత్ర సాగించాయో పైనచూచాం. రైతులు, కార్మికులు కనబరుస్తూ వచ్చినచైతన్యాన్ని చూచి 'కొమింటాంగు'లోని అభివృద్ధినిరోధక వర్గాలు బెదరిపోసాగాయి. చెంగ్-కై-షేక్‌పైని, అధికారవర్గంపైని మెల్లిమెల్లిగా పలుకుబడి పెంచుకోసాగాయి. షాంగ్‌హైని సమీపించేసరికి వీరి ప్రభావం ప్రస్ఫుటమైంది. 'జాతీయసేనలు' వస్తున్నాయని విని షాంగ్‌హై కార్మికులు కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన తిరుగుబాటు లేవదీసి, ఆ నగరాన్ని హస్తగతం చేసుకున్నారు. 'జాతీయసేనలు'రాగానే ఆ నగరాన్ని కానుకగా సమర్పించారు. కాని చెంగ్-కై-షేక్ వారికిచ్చిన ప్రతిఫలమేమిటి? కార్మికనాయకులను, విప్లవయోధులను వందలకొలదిగ పట్టి అకారణంగా చిత్రవధ చేయించాడు. కార్మికోద్యమాన్ని యీ నెత్తురు ఏరులలో ముంచాడు. ఇక జమీందారులు, కోటీశ్వరులు తమ తమ బలగాలతో చెంగ్-కై-షేక్‌తో కలిశారు. ఈవిధంగా (మిగతా 2 పేజీలో)

జపాన్ తలవాల్చెనేలకదె!

ఎదురులేని ప్రజాబలమోయ్ బ్రహ్మాండ
మదరిపోవగ లేచె కనుమోయ్ ॥ఎదురు॥

నీచహిట్లరుల ముసోలినీలను గూల్చి
నాజీల నందరిని నదిసంద్రమున ముంచె ॥ఎదురు॥

టోరీల పలుకుబడి మారణమ్మొనరించి
ప్రజల పరిపాలనన్ పాదుకొల్పిన శక్తి ॥ఎదురు॥

శాంతి యూరపులో స్థాపించి యింటింట
రానెవచ్చెను ఎర్రసేన తూర్పునకదే ॥ఎదురు॥

పెనుతుపానల్లెర్ర సేన పెనవేయ గని
దాసోహమని జపాన్ తలవాల్చెనేలకదె ॥ఎదురు॥

ఏడేండ్లు పదునాలుగేండ్లాయె చైనాకు
పోరాటమునదూకి తీరె బాధలు నేడు ॥ఎదురు॥

జయజయ ధ్వానంతో చైనీయప్రజలంత
యిచ్చెదరు స్వాగతం ఎర్రసైనిక నీకు ॥ఎదురు॥

నిజమెర్రసైనికా ప్రజలీ ప్రపంచమున
ఇంట్లింట నీపేర వెలిగింత్రు దీపములు ॥ఎదురు॥

తల్లులున్ పిల్లలూ తమవారి కెదురుగా
హారతుల నివ్వంగ నాయత్తమగుచుండ్రి ॥ఎదురు॥

దేశరక్షణకొరకు దీక్షతో పోరాడి
వీరగతిపొందిన వీరులకు జోహార్లు!! ॥ఎదురు॥

— సుంకర సత్యనారాయణ.

ప్రజల దిగ్విజయం

ఫాసిస్టు రాక్షసులలో ఆఖరిగుంపు అయిన జపాను దుండగీడుల అంతిమఘడియలు దగ్గరకువచ్చాయి. రేపో మాపో జపాన్ మిత్రరాజ్యాలకు దాసోహమంటుంది. ఐతేనేం యీ పత్రిక పాఠకుల చేతుల్లోకి వచ్చేసరికే, ప్రపంచ ప్రజల విజయఘోషలు ఎల్లెడలా అలముకొంటాయి.

విజయం యింత త్వరగా ఎలా సాధ్యమయింది? ఆసియాఖండాన్నంతనూ పాదాక్రాంతం చేసికొందామని అర్రులుసాచిన జపాను సామ్రాజ్యవాదులు యింతలో ఎలా చిత్తవడం సంభవమయింది?

సోవియట్ ప్రజల సైన్యమైన ఎర్రసైన్యం మే 1 న నాజీల ముఖ్యపట్టణమైన బెర్లిన్ నగరంపై విజయపతాకం ప్రతిష్ఠించింది. మే 8 వ తేదీన జర్మన్ నాజీప్రభుత్వం లొంగిపోయింది.

బెర్లిన్‌నగర సమీపంలో - పోట్సుడంలో - సమావేశమయిన మిత్రరాజ్యనాయకులు జులై 26 వ తేదీన జపాను ప్రభుత్వానికి బేషరతుగా లొంగిపోవాలని అంతిమ ప్రకటన చేశారు. కాని జపాను ప్రభుత్వం లక్ష్యపెట్టకుండా బ్రిటను, అమెరికా, చైనాల తుదిహెచ్చరికను త్రోసిపుచ్చింది. ఇంకా కొంతకాలం యుద్ధంకొనసాగించితే మిత్రరాజ్యాలలో భేదాలు రావచ్చు - ప్రజావిజృంభణకు జడిసి సామ్రాజ్య వాదులు తమకనుకూలమైన సంధిని ప్రసాదించ వచ్చునని జపాను ప్రభుత్వం ఆశించింది.

కాని యీలోగా బ్రిటనులో చర్చిల్-అమెరీల టోరీముఠా ఓడిపోయింది. బ్రిటిషు ప్రజలు లేబరుపార్టీని గద్దె నెక్కించారు. మిత్రరాజ్యాలు పోట్సుడామ్ సమావేశ ప్రకటనలో ప్రపంచ శాంతికి పునాదులు వేశాయి. ఇంక మిత్రరాజ్యాలలో చీలికలు వస్తాయనే జపాను ఆశలు అడుగంటాయి. ఆగష్టు 6 వ తేదీన అమెరికన్ విమానాలు ఆటంబాంబులనే మారణాస్త్రాలను ప్రయోగించుతాయని అధ్యక్షుడు ట్రూమన్ ప్రకటించాడు.

ఆగష్టు 8 వ తేదీన సోవియట్ యూనియన్ జపానుపై యుద్ధం ప్రకటించింది. ఈ ప్రకటన చేస్తూ కామ్రేడ్ మాలటోవ్ ఇలా చెప్పారు: "తమ హెచ్చరికను జపాను త్రోసిపుచ్చాక మిత్రరాజ్యాలు సోవియట్ ప్రభుత్వాన్ని జపాన్ వ్యతిరేక యుద్ధంలో చేరమని కోరాయి. తద్వారా యుద్ధాన్ని త్వరగా ముగించవచ్చు. నష్టాలను తగ్గించవచ్చు. త్వరగా శాంతిని స్థాపించవచ్చు.

"మిత్రరాజ్యాల కోర్కెను అంగీకరించడం తన కర్తవ్యమని సోవియట్ ప్రభుత్వం భావించింది. ఆవిధంగా చేయడంవల్ల త్వరలో శాంతి చేకూరుతుంది. ప్రపంచ ప్రజలను అనవసర రక్తపాతంనుండి, కష్టాలనుండి రక్షించగలుగుతాము. జర్మనీ బేషరతుగా లొంగనిరాకరించుటచే పొందిన విధ్వంసనం లాంటిది తప్పించుకోడానికి జపాను ప్రజలకు అవకాశం లభించుతుంది." అని చెబుతూ మాలటోవ్ జపానుపై యుద్ధం ప్రకటించారు.

వెంటనే ఎర్రసైన్యం మార్షల్ వాసిలవిస్కీ నాయకత్వాన మంచూరియాపైన, కొరియాపైన దిగ్విజయయాత్ర ప్రారంభించింది. వ్లాడివాస్టాక్‌నుంచి, కాబరోవస్కీనుంచి, మంగోలియానుంచి దండయాత్రలు ప్రారంభమయాయి. నాల్గురోజులలో రెండువందలమైళ్ళకు పైగా మంచూరియాలోకి చొచ్చుకుపోయింది ఎర్రసైన్యం. ఇటు కొరియాలో రెండు రేవుపట్టణాలు స్వాధీనమయ్యాయి. సఖలిన్ దీవికి దక్షిణప్రాంతంలో ఎర్రసైన్యాలు దిగాయి. ఈవిధంగా ఎర్రసైన్యం తుపానువలె జపాను పడిగద్దకు సమీపంలోనే ముంచుకువస్తోంది.

ఇంకేమి చేయగలరు జపాను ఫాసిస్టులు? మిత్రరాజ్యాలలో చీలికల ఆశలడుగంటాయి. ఒకవంక 'ఆటం' బాంబులు; మరొకవంక ఎర్రసేనల తుపాను;

ఎర్రసేన దిగ్విజయయాత్రప్రారంభించిన 36గంటలకే జపాను ప్రభుత్వం స్విట్జర్లాండు ద్వారా సంధి రాయబారాలు ప్రారంభించింది. పోట్సుడాం హెచ్చరికను అనుసరించి లొంగిపోవడానికి సంసిద్ధతను తెలిపింది. జపాను చక్రవర్తి పరిపాలనాధికారం గురించి మిత్రరాజ్యాల అభిప్రాయం ఏమిటో తెలుపమని కోరింది.

రష్యా, చైనా, బ్రిటను, అమెరికా ప్రభుత్వాలు సంప్రదించుకొని జపాను లొంగుబాటుకు తమ షరతులను తెలియజేశాయి. 'జపాను చక్రవర్తి, అతని ప్రభుత్వం మిత్రరాజ్య సర్వసేనాని అజమాయిషీక్రింద వుండాలి. లొంగుబాటు షరతులను అమలుజరపడానికి అవుసరమైన చర్యలన్నిటిని సర్వసేనాని తీసికుంటారు' అని మిత్రరాజ్యాలు తెలియజేశాయి.

రేపో మాపో జపాను లొంగిపోతతప్పదు. 14 సంవత్సరాలనుండి జపాను దురాక్రమణదారులచే పీడింపబడుతున్న 40 కోట్ల చైనాప్రజలు విముక్తిచెందుతారు.

ఇది ఫాసిస్టు ద్రోహులకు ఆఖరిదెబ్బ. ఆసియా ప్రజలకొక శుభదినం. ప్రపంచప్రజలకు మహావిజయం.

జపాను దురాక్రమణ చరిత్ర

(మొదటి పేజీ తరువాయి) డాక్టరు సన్‌యట్‌సేన్ కింద ప్రజావుద్యమంగా ప్రారంభమయిన 'కొమింటాంగు' చంగ్-కై-షేక్ హయాములో జమీందారుల, ధనికవాదుల చేతిలో కీలుబొమ్మయి, అభివృద్ధినిరోధక ఉద్యమంగా మారింది. చైతన్యంతో ఉప్పొంగుతూన్న ప్రజలకు దానికి మధ్య నెత్తురుచేరులు పెరిగాయి. అంతేకాదు. మొదటినుంచి చైనావట్ల సానుభూతి సహకారాలను చూపిన సోవియట్‌తో చంగ్-కై-షేక్ నాంకింగు ప్రభుత్వం ఆరోజుల్లో సంబంధం తెంచుకుంది. బ్రిటన్, ఫ్రాన్సులవైపు మొగ్గింది. దేశంలో యితర పార్టీలన్నిటిని నిషేధించింది. ఈవిధంగా ప్రజల సానుభూతి, సహకారాలను కోల్పోయిన నాంకింగు ప్రభుత్వం జపాను దురాక్రమణను ప్రతిఘటించలేకపోయిందంటే ఆశ్చర్యమేముంది?

ఏకారణాలచేతనైతే బ్రిటన్, ఫ్రాన్సులు యూరప్‌లో నాజీ జర్మనీని, ఫాసిస్టు ఇటలీని బలపరచాయో, సరిగ్గా అదే కారణాలతో ఆసియాలో జపానుకూడా మద్దతు నిలిచాయి. సోవియట్ యూనియనుకి పక్కలో పల్లెంగా జపానును నిలబెట్టాలని వాటి పన్నాగం. అంతేకాదు. ప్రజాస్వామిక రాజ్యంగా 'చైనా' బలపడటమంటే ఆసియాలోని తమ సామ్రాజ్యాలకే ముప్పు. అలా జరక్కుండా కాపుదలగా కూడా జపానును ఉపయోగించాలనుకున్నాయి. ఈ కుట్లను మనసులో పెట్టుకొని, నానాజాతిసమితి జపానుమీద ఏలాంటి చర్యతీసుకోకుండా చేశాయి. ఈవిధంగా ఇటు చైనాలోని అభివృద్ధివిరోధకులకు, అటు విదేశప్రభుత్వాలకూ, కమ్యూనిజం అంటే ఉన్న ద్వేషం, ప్రజాస్వామ్యంపట్లగల వ్యతిరేకత జపాను సామ్రాజ్యవాదుల ఆటలు సాగడానికి చక్కని అవకాశంగా ఉపయోగించాయి. అటుతరువాత జరిగిన పనిపిక్కు నాటకానికంతటికీ ఇదే మూలసూత్రం.

విచ్ఛిన్నకరమైన పోకడలు

ఆరోజుల్లో చైనా ఎదుటవున్నవి మూడేమార్గాలు. జపానుని ప్రతిఘటించడం - ఒకటి. ఇందుకు దేశంలో అవలంబించ వలసిన విధానాన్ని మార్చుకోవడం అవసరం. ప్రజాఉద్యమాలను బలపరచవలసి వస్తుంది. అది నాంకింగ్ ప్రభుత్వానికి ఇష్టంలేదు. రెండోమార్గం - విదేశాలపై ఆధారపడడం. మూడవది జపానుకు లొంగిపోవడం. అప్పుడే ప్రధాన మంత్రిగా ఉండిన వాంగ్‌చింగ్‌వై (తరువాత జపాను వారితో చేరిన ద్రోహి) రెండో మార్గాన్నే ఎంచాడు. అదివరకే అతను నాజీజర్మనీ, ఇటలీలతో సంబంధం ఏర్పరచుకొన్నాడు. అధికారంలోకి రాగానే ఇతడు జపానును సంతృప్తిపరచడం, కమ్యూనిస్టు ప్రదేశాలమీద అంతర్యుద్ధమూ, ప్రారంభించాడు. అంత మంచిపని చేస్తుంటే నాజీలూరుకుంటారా? మిలిటరీ నిపుణులను పంపారు, నాంకింగుకి సలహాదారుగ.

ఈ నాజీ నిపుణులు చైనా కమ్యూనిస్టు ప్రదేశాలచుట్టూ, ముట్టడికి ఉక్కుకోటలు నిర్మించారు. కమ్యూనిస్టు సేనలమీద దాడిచేయడంలో చంగ్-కై-షేక్‌కి బ్రిటిష్‌యుద్ధనావల ఫిరంగులు కూడా తోడ్పడ్డాయి.

ఐక్యతా సందేశం

ఫాసిస్టు జపాను దురాక్రమణకు సిద్ధంగా ఉన్నప్పుడు ఇలా అంతర్యుద్ధానికి పూనుకోవడం దేశంయొక్క గొంతుక్కోయడమే. ఈసంథా మానుకొని డాక్టరు సన్‌యట్‌సేన్ సూచించిన ప్రజాస్వామిక సూత్రాలపైని ప్రజలను సంఘటితపరచి, అన్నిపక్షాలు ఏకమై జపాన్ని ప్రతిఘటించాలని చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం సందేశం ఇచ్చింది. దేశంలోని మేధావులు, విద్యార్థులు, కార్మికులు బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరిపి దీనిని మారుమ్రోగించారు. అయినా నాంకింగు ప్రభుత్వం వినలేదు. తన విచ్ఛిన్నకరమైన పోకడలు సాగిస్తునే వచ్చింది.

ఇటు అంతర్యుద్ధాన్నీ, అటు సోవియట్‌కిపోటీగా ఫాసిస్టు దేశాన్ని బలపరచాలని బ్రిటిష్, ఫ్రెంచి సామ్రాజ్యవాదుల తహతహను ఫాసిస్టుజపాను కనిపెట్టింది. తనకిక అడ్డులేదనుకుంది. ఎవడో తమసైనికుడొకరు కనబడకుండా పోయాడని సాకుజెప్పి 1937 జులై 7 వ తేదీని పైపింగు నగరం వద్ద పెద్దయెత్తున దండయాత్ర ప్రారంభించింది. ఆగస్టు 13 న షాంగ్‌హై నగరాన్ని ముట్టడించాడు. ఈమధ్యకాలంలో జపాను సైనికబలాన్ని, ఆయుధసామగ్రిని బాగా సేకరించింది. ఈబలం అంతటితోను విరుచుకుపడి, కొద్దికాలంలోనే చైనాను పాదాక్రాంతంచేసుకొందామని దాని ఎత్తుగడ.

ఐక్యసంఘటన

కాని ఈసారి వారి నెదుర్కొన్నది మునుపటి చైనా కాదు. చైనా కమ్యూనిస్టుపార్టీ, ఇతర ప్రజాస్వామిక, అభివృద్ధికర శక్తులూ సాగించిన ఐక్యతా ఉద్యమం ప్రజల్లో బ్రహ్మాండమైన సంచలనం కలిగించింది. చైనా పాలకవర్గం జపాను వ్యతిరేక యుద్ధం ప్రకటించక తీరిందికాదు. "ఇక ఊరుకోలేము.... చావో, బ్రతుకో తేలేవరకు ప్రతిఘటన సాగించడమే ఇక కర్తవ్యం. అంతిమవిజయం చేపట్టగలమనే ఆశవాకుంది." అని చెంగ్-కై-షేక్ జులై నెలాఖరుకి ప్రకటించాడు.

మరికొన్నాళ్ళకు-1937 సెప్టెంబరులో-కమ్యూనిస్టుపార్టీకి కొమింటాంగుకి ఒడంబడిక కుదిరింది. 1931 నుంచి దేనికోసమైతే చైనా ప్రజపరితపిస్తూ వచ్చిందో ఆ జాతీయ ఐక్యసంఘటన అప్పటికి సిద్ధించింది.

ఆనాటినుంచి చైనా ప్రజలు మానవేతిహాసంలో ఒక మహోజ్వల ఘట్టాన్ని రచిస్తూ వచ్చారు. సముద్రతీరమంతా శత్రువశమయింది. అనేక ముఖ్యపట్టణాలు చేయిజారిపోయాయి. పారిశ్రామిక కేంద్రాలు పోయాయి. కోట్లకొలది ప్రజలు జపాను కిరాతకుల వాతబడి చిత్రవధలు పొందారు. జపానువిమానాలు నిత్యనైవేద్యంగా ప్రళయవర్షం కురిపించాయి. కాని చైనా ప్రతిఘటనదీక్ష ఆవంతయినా సన్నగిలలేదు. గెరిల్లాయుద్ధ పద్ధతుల నవలంబించారు. శత్రుశ్రేణుల వెనుక భాగంలో విశాల ప్రదేశాలను విముక్తిపరచి, అక్కడ ప్రజాస్వామిక పద్ధతులపై పరిపాలన నెలకొల్పారు గెరిల్లానాయకులు. కమ్యూనిస్టు సేనలే ఈగెరిల్లా ఉద్యమానికి నాయకత్వం వహించాయి. 3,53,000 చదరపు మైళ్ళ ప్రదేశాన్ని ఈవిధంగా విముక్తిచేశాయి. 9 కోట్ల 50 లక్షల ప్రజలకు స్వాతంత్ర్యాన్నిచ్చాయి. పారిశ్రామికంగా కలిగిన నష్టాన్ని పూడ్చుకోడానికి ఒక కొత్త ఉద్యమాన్ని ప్రారంభించారు. ఎప్పుడువడితే అప్పుడు, ఎక్కడికక్కడ ఊడదీసి, తిరిగి కొత్త ప్రదేశాల్లో స్థాపించుకోడానికి వీలయిన ఫ్యాక్టరీలను నిర్మించసాగారు. అంటే పరిశ్రమల్లో కూడా గెరిల్లాపద్ధతిని తెచ్చిపెట్టారు. బర్మాకు, ఇతరప్రాంతాలకు నేలమీదుగా బాటలువేసి, సముద్రమార్గాలు పోయిన కొరతను కొంతవరకు తీర్చారు. దేశంలో ఏర్పడిన ఐక్యసంఘటన ప్రజల చైతన్యాన్ని శతముఖాలుగ వికసింపజేసింది. ద్రోహి వాంగ్‌చింగ్‌వై శత్రుపక్షంచేరి సాగించిన విషప్రచారం వ్యర్థమయేలా చేసింది. దేశంలోఉన్న ఫాసిస్టు అనుకూలురయుక్తులు ఫలించకుండా చేసింది.

సామ్రాజ్య ప్రభుత్వాల వైఖరి

మహత్తర కార్యాలు సాధించగల ప్రజాచైతన్యం ఇంత ఉన్నా, సమరదీక్షకు కొదవేమీ లేకపోయినా, చైనా ఇంతవరకు ఎదురుదాడి ప్రారంభించలేక పోయింది. ఎందువల్ల?

ఐక్య ప్రతిఘటన ప్రారంభమయిన నాటినుండి చైనా కమ్యూనిస్టుపార్టీ ప్రభుత్వానికొక విజ్ఞప్తి చేస్తూవచ్చింది.

(మిగతా 11 వ పేజీలో)

ఆంధ్ర కాంగ్రెసు పెద్దల రభస

మద్దుకూరి చంద్రశేఖరరావు

ప్రజాశక్తి సంపాదకులకు

ఆర్యా!

1-8-45 తేదీ "ప్రజాశక్తిలో" డాక్టరు పట్టాభికి వ్రాసిన బహిరంగలేఖలో డాక్టరు పట్టాభి గాంధీజీపట్ల అపచారం చేసినట్లు వ్రాయబడింది. కాని ఆ ఆరోపణతో ఏకీభవించడం కష్టంగా వుంది.

ఆంధ్రా సర్క్యులర్‌గూర్చి బెజవాడ సభలో డాక్టరు పట్టాభి చెప్పింది అక్షరాల నిజమేనని వివిధములైన వ్రాతలు చూచినతర్వాత అనిపిస్తూవుంది. ఎందుచేతనంటే,

పట్టాభిగారి ఉపన్యాసానంతరం సేవాగ్రామం నుంచి వచ్చిన అభిప్రాయాలలో సర్క్యులర్‌ను గూర్చి "యిపుడు మాట్లాడటం అనవుసరం" అనీ "సమయోచితం కాద"నీ అన్నారేగాని పట్టాభిగారు చెప్పినది అబద్ధమని ఎవరూ అనలేదు.

ఇక, పట్టాభిగారే "నేనలా అనలేద"న్నారుగా, అంటే యిపుడు ఆలోచించాల్సింది తర్వాత వారు ఏమన్నదీ కాదు. ముందన్న దాంట్లో ఎంతవరకు సత్యముందీ అని. సర్క్యులర్‌లోని కార్యక్రమాన్ని చర్చించినట్లు ఆంధ్రకాంగ్రెసు పెద్దలు తిరుమలరావు, కాశేశ్వరరావు, ప్రకాశంగార్లు అంగీకరించారు. అధ్యక్ష కార్యదర్శుల సంతకాలు దానిమీద ఉన్నాయి. ఈ నగ్నసత్యాన్ని నిరాకరించడ మెలా?

ఇక యిది పైనుంచి వచ్చిందా, లేక క్రిందనే పుట్టిందా, అంటే "పైనుంచే గాంధీజీతో చర్చించి, వారి ఆదేశానుసారం" అని పట్టాభిగారి జవాబు.

ఇది అసత్యమా? డాక్టరు పట్టాభి గాంధీ సూత్ర భాష్యకారుడు. కాంగ్రెసు చరిత్ర రచయిత. అట్టివాడు గాంధీజీపట్ల తెలిసి అపచారం చెయ్యడుగదా!

తీగలు తెంపడం, పట్టాలు పీకడం కాంగ్రెసు ప్రోగ్రాం కాదని కమ్యూనిస్టు అంటే, కాంగ్రెసు ప్రోగ్రామేనని ఖచ్చితంగా చెప్పారు పట్టాలు పీకినవారంతా. ఆ ఏకలవ్యులు ద్రోణుని శిష్యులేనని ఆనాడు కమ్యూనిస్టు లంగీకరించలేదు. కారణం, తర్వాత కొంతకాలానికి గాంధీ, అజాద్‌లు విధ్వంస కార్యక్రమం కాంగ్రెసుది కాదనడం.

ఇపుడు పట్టాభిగారు కాంగ్రెసు ప్రోగ్రామేనంటున్నారు. గాంధీజీ దేశానికి నాయకుడైతే పట్టాభిమాత్రము? పైపెచ్చు వర్కింగు కమిటీ సభ్యుడు!

నిష్పక్షపాతంగా నిజమాలోచిస్తే ఒకరు టెక్నికాలిటీస్ చాటున సత్యాన్ని మరుగుపరిస్తే మరొకరు సత్యాన్ని నగ్నంగాచెప్పి విమర్శకు పాత్రులయ్యారు.

ఇక "ఆంధ్రపత్రిక" అన్నట్లు గోపాలరెడ్డిగారు ప్రశ్నించడం తప్పా? ఎందుకని? ఆగష్టు ఉద్యమంలో పాల్గొన్న ఆంధ్ర కాంగ్రెసు అనుచరులు ఏమనుకుంటున్నారు? "అయ్యో, నిజంగా మనల్ని తీగెలు తెంపమన్నారే. యిపుడు కాదంటున్నారే! ఇదేమిపాతకం" అని.

వారికి జవాబు చెప్పక్కర్లేదా?

ఇపుడు అసలు చిక్కు ఎక్కడంటే, పట్టాభిగారు ముందు ఖండితంగా చెప్పిన దానిని నెమ్మది నెమ్మదిగా ఉపసంహరించుకోవడంతో! అది అంత బాగుండలేదని నేను ఒప్పుకుంటా.

కాని, ఏంచెయ్యమంటారు? పైన ఏకైకనాయకుడు గాంధీజీ; క్రింద, ముందు 'శహబాష్!' అనీ, తర్వాత 'అసంగతం' 'అనుచితం' 'అనవుసరం' అంటూవున్న అనుయాయులు; అంచేత వివరీకరణ, పునరాలోచన (After thought) మాత్రమే; ఇక పట్టాభిగారి దోషమెక్కడ?

ఇంతేగాక శ్రీ కంభంపాటి సత్యనారాయణగారు మరో ఆరోపణచేశారు. కమ్యూనిస్టుల దుయ్యబట్టించడానికి పట్టాభి బెజవాడ ఉపన్యాసంచేశాడని. ఇది సబబా? నిజమాలోచిస్తే మిగతా ఆంధ్ర కాంగ్రెసు పెద్దలవలె పట్టాభి బయటికివస్తూనే విచక్షణలేకుండా కమ్యూనిస్టులను నీచంగా దూషించలేదు. వెంగమ్మ నాటకాలు ఆడించమని ప్రోత్సహించలేదు. ఆంధ్రత్వం శీలాన్ని శంకిస్తూ గుజరాతీయులకు మొరపెట్టుకోలేదు.

ఇక పట్టాభి యీ స్టేటుమెంట్ల లో ప్రజల మనసు గందరగోళల పెడుతున్నాడనేదానిగూర్చి. మాబోటి సామాన్య ప్రజలను చీకాకుపరచేది పట్టాభి మాత్రమేనా? కాదు - ప్రజల నడవడిని సరిదిద్దే బాధ్యత అంతా తమ భుజస్కంధాలమీద మాత్రమే ఉందనుకునే కాంగ్రెసు పెద్దలంతా చీకాకుపరుస్తున్నారు.

చూడండి! భులాభాయి - లియాఖత్ ఒడంబడికను నే నాశీర్వదించినానని గాంధీజీ అంటే, భులాభాయి స్వార్థంతో కాంగ్రెసును ద్రోహంచేశాడని ప్రకాశం అన్నారు. ఎవరు సరి? ఒకరు విద్యార్థులకు రాజకీయాలు కావాలంటారు; మరొకరు వద్దంటారు! ఒకరు నేషనల్ ప్లానింగంటే పెద్ద యంత్ర పరిశ్రమలను పెంపుచేయడమంటారు; ఇంకొకరు "పెద్ద పరిశ్రమలు నశించాలి; రాట్నం త్రిప్పు" ఇదే నేషనల్ ప్లానింగు అంటారు. ఒక మేధావి విదేశ కమ్యూనిస్టులను భూషించిన నోటితోనే స్వదేశ కమ్యూనిస్టులను బూతులు తిడుతాడు. వీరంతా కాంగ్రెసు అగ్రనాయకులే! ఈమాదిరి పెద్దలలో పట్టాభి భవిష్యత్తు? అందునుగూర్చి యెవరూ చింతించ నక్కరలేదు. అదేదో నిర్ణయమయ్యేపోయింది.

— వడ్లమూడి సత్యనారాయణ,

కవుతరం, (కృష్ణాజిల్లా).

శ్రీ వడ్లమూడి సత్యనారాయణగారు కాంగ్రెసువాదులు, దేశభక్తులు, కమ్యూనిస్టుల యెడ సానుభూతి కలిగినవారు. పై లేఖలో వారు ఆంధ్ర కాంగ్రెసుపెద్దల పనులవల్ల తమకు కలుగుచున్న సందేహాలను, చీకాకును తేటతెల్లం చేశారు.

పట్టాభిగారు బెజవాడ సభలో చెప్పిన మాటలు నిజమేననీ, కాని పైనుంచి గాంధీజీ-క్రిందనుంచి అనుయాయులు 'అనుచితం' అనుటచేత పునరాలోచన చేసుకున్నారనీ, ఇందులో వారి దోషమేమీ లేదనీ వ్రాశారు. పట్టాభిగారికి బహిరంగలేఖలో కంభంపాటి సత్యనారాయణగారు పునరాలోచించుకున్నందుకు పట్టాభిగారిపై దోషారోపణ చేయలేదు. పట్టాభిగారు 8 వేల మంది ప్రజలున్న ఆ సభలో చెప్పిన మాటలను చెప్పలేదని బుకాయించారు. పత్రికలవారు తప్పులు రిపోర్టు చేశారన్నారు. తాము తెలుగులో ఉపన్యసించితే అనువాదంలో పొరపాట్లు రిపోర్టు చేశారని తప్పుకోచూచారు. కాని తెలుగు పత్రికలు కూడ అలాగే రిపోర్టు చేశాయిగా! ఇంతెందుకు? కంభంపాటి సత్యనారాయణగారే స్వయంగా ఆసభలోవుండి విన్నారు. వాస్తవికంగా అన్నమాటలను అనలేదనడంఎందుకు? పత్రికలు తప్పురిపోర్టు చేశాయనడంఎందుకు? ఇందుకే కంభంపాటి సత్యనారాయణగారు పట్టాభిగార్ని ఆక్షేపించారు. పట్టాభిగారు పునరాలోచనలో తాము తప్పుచేశామని గుర్తించితే సూటిగా ఉపసంహరించుకోవలసింది. ఎంతవారైనా పొరపాటు పడవచ్చు. తెలిశాక దిద్దుకోడం బుద్ధిమంతులలక్షణం. కాని పట్టాభిగారు అలాచేయలేదు. పత్రికా విలేఖరులపై తప్పురుద్ది ప్రపంచకళ్లు కప్పడానికి ప్రయత్నించారు. దానినే కంభంపాటి సత్యనారాయణగారు బహిరంగ లేఖలో విమర్శించారు.

వడ్లమూడి సత్యనారాయణగారు ఇంకో సందేహంకూడ వెల్లడించారు. "పట్టాభిగారు చెప్పినది 'యిపుడు అనవసరమనీ' 'సమయోచితం కాదనీ' అన్నారేగాని పట్టాభిగారు చెప్పినది అబద్ధమని ఎవరూ అనలేదు. అందుచే ఆ విషయం సత్యమే అయివుండవచ్చునని అభిప్రాయపడ్డారు. పైలేఖ వచ్చాక గాంధీగారు వార్ధానుంచి ఒక ప్రకటన చేశారు. దానిలో ఆంధ్రసర్క్యులర్ విషయమై ప్రభుత్వానికి యిచ్చిన జవాబునే పునరుల్లేఖించారు. వారిలా స్పష్టంగా అన్నారు: "నాకు ఆగష్టు తీర్మానం ప్రకారం పనిచేయడానికి అవకాశమే లభించలేదు. అందుచే ఆంధ్రసర్క్యులర్ కాంగ్రెసు చేతగాని నాచేతగాని అనుమతింప బడినదికాదు." (ఆగష్టు 5 హిందూ పత్రిక)

గాంధీజీ యింత స్పష్టంగా చెప్పాక వడ్లమూడి సత్యనారాయణగారి సందేహం తొలగివుంటుందని ఆశించుతాను. వారు యింకో విషయంకూడ గుర్తించాలని మనవిచేస్తాను. ఆగష్టు ఉద్యమంలో, "పట్టాలు పీకినవారంతా కాంగ్రెసు ప్రోగ్రామేనని ఖచ్చితంగా చెప్పార"ని లేఖలో చెప్పినమాట నిజమే. అనేకమంది కాంగ్రెసువాదులు అలా మోసపోయి తప్పుడు మార్గాన పడ్డారు. గాంధీజీ లేఖలు, కాంగ్రెసు అధ్యక్షులైన ఆజాద్ లేఖలు ప్రకటించిన తరువాత పై పొరపాట్లు పడినవారు దిద్దుకోవాలి. అలా చేయక తప్పు మార్గమే సరియైనదని చెప్పుకోవడం సబబు కాదు.

ఒకవైపున కాంగ్రెసు పెద్దలు ప్రభుత్వంతో ఆగష్టు ఘటనలు కాంగ్రెసుఉద్యమం కాదంటున్నారు. రెండోవైపున వాటిలో చేరనందున కమ్యూనిస్టులను దేశద్రోహులని నిందించడానికి తయారవుతున్నారు.

రంగా తికమకలు

ఉదాహరణకు చూడండి: ఒకవైపున ఆంధ్ర సర్క్యులరుతో కాంగ్రెసుకు ఎట్టి సంబంధం లేదని గాంధీజీ ప్రకటించారు. పట్టాభి సీతారామయ్యగారు పునరాలోచనలో అలాగే చెప్పుకున్నారు. సిమ్లా సమావేశంలో వర్కింగ్‌కమిటీ ఆంధ్ర సర్క్యులర్‌ను హర్షించిందని తాము చెప్పలేదన్నారు. ఆంధ్ర పత్రిక రిపోర్టు సరికాదనికూడా ప్రకటించారు. ఇన్ని తర్జనభర్జనలు జరిగాక గుంటూరుజిల్లా విద్యార్థికాంగ్రెసు సమావేశంలో రంగాగారేమంటున్నారో గమనించండి!

"డాక్టర్ పట్టాభి వైఖరికి, ఆంధ్ర సర్క్యులర్‌కు నేను గర్విస్తున్నాను. భారత స్వాతంత్రోద్యమ పురోగమన మార్గంలో ఆసర్క్యులర్ ఒక అత్యంత ప్రముఖ సంఘటన.... "సిమ్లాలో జరిగిన వర్కింగ్‌కమిటీ సమావేశం డాక్టర్ పట్టాభి ముందంజను హర్షించి, అహింసా పూర్వక కార్యక్రమమును సరియైన మార్గంలో సిద్ధపరచిన ఆయనను అభినందించినందుకు నాకు ఆనందంగావుంది." (7-8-45 ఆంధ్రప్రభ)

ఒకవైపున పట్టాభి తాము చెప్పిన మాటలను ఉపసంహరించుకున్నారు. ఇంతా జరిగాక మళ్ళీ రంగాగారు సిమ్లావర్కింగ్‌కమిటీ ఆంధ్ర సర్క్యులరును హర్షించిందని దబ్బాయించడమెందుకు? ఏమిటీ రభస?

రంగాగారు పట్టాలు పీకడం, తీగలు తెంచడం కాంగ్రెసు కార్యక్రమమని ప్రచారం చేసిన ప్రముఖుల్లో ఒకరు. అలా ఎందరినో యీ పెద్దమనిషి మోసపుచ్చారు. సుభాసుబోసు జపాను సైన్యాలతో వస్తాడు, పూలదండలతో ఉండమని కూడ యీయన చెప్పారు. అటు బాంబింగు జరుగుతూంటే యిటు పట్టాలు పీకమని చెప్పిన ఉదాహరణలున్నాయి.

అవన్నీ అపుడు ప్రభుత్వానికి ఉపయోగించుతాయని మేం ప్రకటించలేదు. ఇపుడు ఆలాంటి ప్రమాదం లేదుకనుక వివరించుతున్నాము.

తాను మోసపుచ్చిన ప్రజలముందు నిలబడి రంగాకు నిజం ఒప్పుకొనే ధైర్యంలేదు. అందుచేత ఒకసారి పట్టాభిచెప్పి చివాట్లుతిని ఉపసంహరించుకున్న మాటలనే, మళ్ళీ రంగా చెబుతున్నాడు. వర్కింగ్ కమిటీ సిమ్లా సమావేశం ఆంధ్ర సర్క్యులర్‌ను హర్షించిందంటున్నాడు. (మిగతా 10వ పేజీలో)

దొంగ మార్కెట్లు

5000 గజాలనిలవబట్ట బయటపడింది

★

క్రూరాల రామకుటుంబరావుగారు తెనాలిలో ఒక బట్టలవర్తకుడు. 3-8-1945 వ తెనాలి తాలూకా రైతుసంఘాధ్యక్షులు రావి చిన అమ్మయ్యగారు ఇతని కొట్లోకి వెళ్ళి, 3 గజాల స్టాండర్డుగుడ్డ కావాలని కోరారు. గుమాస్తా 3 గజాలూ కొలిచి యిచ్చారు. దాని విలువను ఆగుమాస్తాకు యిచ్చి, బిల్లు యివ్వమని అడుగగా, చేతిలోనుంచి గుడ్డ లాగుకొని, "నీలాంటి వాళ్ళు చాలమంది కొన్నారు. ఎవరికీ బిల్లు ఇవ్వము" అని కసరనాగారు. కాని అమ్మయ్యగారు పట్టుదట్టగా ఒక బిల్లు యిచ్చారు. కాని దానిమీద లైసెన్సు నెంబరు లేనేలేదు. యిది అనుమానాస్పదంగా వుందని చీరాల అసిస్టెంటు టెక్స్టయిల్ ఆఫీసరుగారికి వెంటనే బిల్లుతో సహా రిపోర్టు ఇచ్చారు. వారు కొట్టు సోదా చేశారు. 107 తానుల స్టాండర్డుక్లాత్ దాదాపు 5000 గజాలు-రహస్యంగా దాచబడిబడిఉంది. అర్ధకం వేయబడిన స్టాండర్డు క్లాత్ చీరెలు దొరికాయి. ఆఫీసరుగారు స్టేటుమెంట్లు రికార్డు చేసుకున్నారు.

మరునాడు సాయంత్రం గుంటూరుజిల్లా కంట్రోలు ఆఫీసరుగారు కూనాల రామకుటుంబరావుగారి యింటిపక్క యిల్లు సోదా చేయగా, 26 తానుల స్టాండర్డుక్లాత్, 3 తానుల పాప్లైన్ షర్టింగు బయటపడ్డాయి. కాని, యే కారణం చేతనో రామకుటుంబరావు యిల్లు సోదాచేయ నిరాకరించారు. ఈ రామకుటుంబరావే ప్రభుత్వానికి లోగడ స్టాండర్డు క్లాత్ స్టాకులు తనవద్దలేవని తెలియజేశాడు. కాని ఈ విధంగా పెచ్చుధరలకు అమ్ముతున్నారు.

ఎంతోమంది బీద ప్రజలకు స్టాండర్డు క్లాతు తప్ప మరొకటి అందుబాటులోలేదు. అదికూడా వారికందనీయకుండా, దొంగవ్యాపారము సాగిస్తూ, వారిని ఎన్నో బాధలకు గురిచేసిన ఈవర్తకుని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

బెజవాడలో

అంతకుక్రితం రావి చినఅమ్మయ్యగారే బెజవాడలో గమిని జ్వాలానరసింహం అనే బట్టలవర్తకునివద్దకు మల్లుగుడ్డకోసం వెళ్లారు. గుడ్డ ఉంచుకొని కూడా, అమ్మనిరాకరించాడా వర్తకుడు. బచ్చు శ్రీరాములు కొట్టుకివెళ్తే, అక్కడా అంతే అయింది. దానిపైని అమ్మయ్యగారు బట్టల కంట్రోలు ఆఫీసరువద్ద ఫిర్యాదుచేశారు. 2-8-45 వ విచారణ. అమ్మయ్యగారు సాక్షుల్ని తెచ్చారు. వారిని విచారించడానికి బదులు ఆఫీసరుగారు వారిని గదమాయించి, బెదరగొట్టడం ప్రారంభించారు. 'ఇదేమిటయ్యా?' అని అడుగుతే, "మీ 'ప్రజాశక్తి' పత్రిక ఏమి వినలేదు ఉందంటూ" ఏమేమో మరిలేని మాటలన్నీ మాట్లాడారు.

బెజవాడలో బట్టల చిల్లరవ్యాపారస్థుల్లో సగానికి పైగా తమకు వస్తున్న బట్టను ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. లాంక్లాత్ బట్ట రు. 1-4-0 అయితే రు. 1-8-0 కు, ఇంకా గ్రామాల్లో రు. 2-8-0. కు కూడా అమ్ముతున్నారు. ఆఫీసర్లు తాన్లకుతాన్లు కొనుక్కుపోతూంటే, ప్రజాసామాన్యంబట్టదొరక్క నానా అవస్థలు పడుతున్నారు. ఈవిషయాలన్ని కంట్రోల్ ఆఫీసరుగారికి తెలియకుండా ఉంటుందా? ఈ అక్రమాలను అరికట్టడం అతనివిధి. అలాచేయడానికిబదులు, ఇలాంటి అక్రమాలను బట్టబయలుచేస్తున్న 'ప్రజాశక్తి' మీదా ప్రజాసేవకులమీద కారాలు, మిరియాలు నూరడం సబబుకాదు. 'ప్రజాశక్తి'కున్న విలువ దానికుంది. ఆఫీసరుగారు తన విలువను తేల్చుకోవాలి. బట్టల దొంగవ్యాపారులను పట్టి వదలకిర్చి, తగిన రీతిగా శిక్షించాలి. ప్రజలకు సక్రమంగా బట్ట అందేలాచేసి, అందరి మన్నలకు పాత్రుడుకావాలి.

నెల్లూరులో

నెల్లూరులోకూడ బట్టల కరువు. దొంగ వ్యాపారుల అక్రమాలు - అ.దోళనకరంగా ఉన్నాయి. ఈనెల రెండవతేదీన శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారి అధ్యక్షతను పట్టణ ఆహార కమిటీ సమావేశమై, ఈ దిగువ తీర్మానం చేసింది.

"మిల్లుబట్ట సప్లయి చాల తక్కువగా ఉంది. వచ్చే కాస్తకూడా కంట్రోలురేటుకి అందరికీ అందడంలేదు. చేనేతబట్ట ధర విపరీతంగా పెరిగిపోవడంవల్ల ప్రజలు కొనలేకుంటున్నారు." మిల్లుబట్ట ఎక్కువగా సప్లయి చేయాలనీ, చేనేతబట్ట ధరలను కంట్రోలు చేయాలనీ, దొంగవ్యాపారా న్నరికట్టాలనీ, యీతీర్మానం కోరింది.

ఒంగోలు తాలూకాలో

ఒంగోలు తాలూకా, పొందూరు శివారు లక్షమక్కపాలెం గ్రామంలో ముగ్గురు బట్టల లైసెన్సుదారులున్నారు. కాని కంట్రోలు రేటుకి అమ్మే అలవాటేలేదు. మెట్టూరుమల్లు నెం. 61 గజం 0-9-10 అంటే వీరు 1-4-0 కి కూడా అమ్ముతున్నారు. అంతేకాకుండా నెల్లూరుజిల్లాలోని పరిహద్దు గ్రామాలతో విపరీత లాభాలకు వ్యాపారం సాగిస్తున్నారు.

ఈ విషయం తెలిసి, పొందూరు రైతుసంఘంవారు మొన్న 6 వ తేదీని ఆ గ్రామం వెళ్లారు. లైసెన్సుదారును కలుసుకొని వారు చేస్తున్నది ఎలా అక్రమమో వివరించారు. కంట్రోలురేటుకి ప్రజలకమ్మమని విజ్ఞప్తి చేశారు. కాని వారు వినిపించుకోలేదు. స్టాకు లేదనీ, ఉన్నా తమఇష్టంవచ్చినట్లే అమ్ముతామనిబుకాయించారు. సరే స్టాకులేనట్లు స్టేటుమెంటు రాసి యివ్వమని ఒత్తిడి తెచ్చారు. దానితో దిగివచ్చారు వర్తకులు. ఒకరు తన వద్దనున్న 2½ తానులు, ఇంకొకరు 10 గజాలు మెట్టూరుమల్లు కంట్రోలుధరకు ప్రజలకు అమ్మారు.

మూడో ఆయన స్టాకులేదని మొండిపట్టు పట్టారు. రైతుసంఘంవారు కాపలాపెట్టారు. నెల్లూరుజిల్లా ముప్పవరము గ్రామరైతు 41 గజాల మెట్టూరు నెం. 61 మల్లు రు. 1-1-6 చొప్పున అమ్మారు. ఆ రైతు బట్టలమూట పట్టుకుపోతుండగా, కాపలా ఉన్నవారు పట్టుకున్నారు. లైసెన్సుదారువద్ద కతనిని తీసుకువచ్చి, కంట్రోలు రేటుకన్నా ఎక్కువగా తీసుకున్నదబ్బు వాపసుచేయించారు. అతనివద్దనున్న మిగతాస్టాకును ప్రజలకు కంట్రోలురేటుకి అమ్మించారు.

లంచగొండులకు - వర్తకులకు ఎగ్రిమెంటు!

నర్సారావుపేటనుంచి కామ్రేడ్ అ. శెట్టి సుబ్బారావుగారు ఈ దిగువ వార్తను పంపుకున్నారు:

నర్సారావుపేటలోని 35 మంది వ్యాపారులు శామ్యూల్ అనే రివెన్యూ ఇన్స్పెక్టరుమీద ఫిర్యాదులుచేస్తూ జిల్లా కలెక్టరుకు, మద్రాసు ప్రభుత్వానికి 9-5-45 న పిటీషన్లు పంపారు.

అందులో - బస్తాకుఅణా, వాగనుకు రెండు రూపాయిలు, చొప్పున లంచమివ్వమని పేదిస్తున్నాడని, ఇవ్వకపోతే బూతులు తిడుతున్నాడని -

యుద్ధవ్యతిరేకప్రచారము, బ్లాక్ మార్కెట్, చట్టవిరుద్ధమైన కరపత్రాలు దాచుట, మొదలైన కారణాలు కల్పించి ప్రాసిక్యూట్ చేస్తానని భయపెడుతున్నాడని - తెలియజేశారు.

మే మింతకుముందే యుద్ధబాండ్లు కొన్నాము. మాకు వచ్చేలాభం బహుస్వల్పం గనుక లంచాలిచ్చుకోలేము. అని వర్తకులు తెలియజేశారు. ఆరోజుల్లోనే టెలిగ్రాముల ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

ప్రభుత్వం ఇతని చర్యల్ని ఎంక్వయిరీ చెయ్యమని ఆజ్ఞాపించింది. ఆర్. డి. ఒ. శామ్యూల్‌కి సహచరుడు కావడంచేత, వీరైవన్నిసార్లు వాయిదా వేశాడు. విచారణ దూర ప్రదేశాలకు మార్చాడు. వ్యాపారుల్ని పనిగించేందుకు సర్వప్రయత్నాలు చేశాడు.

ఈ పరిస్థితులు తెలియచేస్తూ జిల్లా కలెక్టరుకు మళ్ళీ అప్లికేషను వెళ్ళింది. ఆయన త్వరలో విచారించమని రెఫర్ చేశాడు. ఇంతలో ఆ డిప్యూటీ కలక్టరు ట్రాన్స్‌ఫర్ అయినాడు. కొత్తాయన పాత డిప్యూటీ కలెక్టరును తలదన్నుతున్నాడు.

ఈయన ఎంక్వయిరీచేస్తూ, కోర్టులో ప్లీడర్ల ముందు వ్యాపారులను యీ విధంగా బెదరించాడు:

"మీరంతా ఉన్నవాళ్ళు, మేం లేనివాళ్ళం. మరి లంచాలు తీసుకోక ఏంచేస్తాం? మీరు ఈ కేసును ఉపసంహరించుకోండి. లేకుంటే మిమ్మల్ని ముప్పతిప్పలుపెట్టి మూడు చెరువులనీళ్ళు తాగిస్తాను. ఆలోచించుకోండి. తేదీ లేకుండా వాయిదా వేస్తున్నాను." అని హడలగొట్టాడు.

ఈ బెదరింపుతో వ్యాపారులు వెనుకంజవేశారు. సమాధానానికి రాకపోతే ఏమిచిక్కులొస్తాయోనని ఈక్రిందిఎగ్రిమెంటు శామ్యూల్‌తో వ్రాసుకున్నారు.

"మహారాజశ్రీ బత్తుల సత్యనారాయణ" ....గార్లకు-

మీరును, ఇంక నర్సరావుపేటలో మన్న కొంతమంది వర్తకులునూ కలిసి నామీద శ్రీ గుంటూరుజిల్లా దొరగారికిచ్చిన అర్జీలు ఈరోజున విచారణ లేకుండా వదులుకున్నందుకుగాను మీలో ఎవరిమీదగాని నేనుఎలాంటి సివిలు, క్రిమినలు చర్యలు జరుపనని ఇందు మూలముగా వ్రాసి ఇవ్వడమైనది.

(సం) యల్. శామ్యూల్
ఆర్. ఐ. నర్సరావుపేట."

"మహారాజశ్రీ నర్సరావుపేట డిప్యూటీ కలెక్టరు దొరవారి దివ్యసముఖమునకు: నర్సరావుపేట వర్తకులు వ్రాసి దాఖలుచేసిన అర్జీ.

అయ్యా,

మేము 9-5-45న నర్సరావుపేట రివిన్యూ ఇన్స్పెక్టరు యల్. శామ్యూల్‌మీద అర్జీఇచ్చుకొని యున్నాము. సదరుఅర్జీ విచారణలో వుండగా తమరువారిని నర్సరావుపేట ఫిర్కానుండి వల్లూరు తాలూకాకు మార్చినారు గనుక మా అర్జీ విచారించవలసిన అవసరం లేదు."

రివెన్యూఇన్స్పెక్టరు బదిలీ ఐనంతమాత్రాన అతని దుండగాలు రూపుమాసిపోవు. ప్రభుత్వోద్యోగులు బహిరంగంగా లంచగొండితనాన్ని ప్రోత్సహించి బలపరచడం నర్సరావుపేటలో లంచగొండులకు, దొంగవ్యాపారులకు మంచి అవకాశంగా వున్నది.

"డిప్యూటీ కలెక్టరు చాలా మంచివాడు. పెట్టుబడిదార్లకు అనుకూలం" అని సాహుకార్లు చంకలెగురవేస్తున్నారు. కాని నానాటికి ప్రజలస్థితి దుర్భరమౌతోంది.

నిడదవోలులో

★

నిడదవోలులో 'అహమ్మదియా రైసు మిల్లు' ఉంది. వీరు కృష్ణకాటుకల బియ్యానికి కదిలీ రేటువేసి అమ్మినందుకు ఇదివరకే ఒక కేసు ఉంది. అయినా దొంగవ్యాపారం మానలేదు.

గతమాసం 31 వ తేదీన పట్టణ ఆహార కమిటీ కార్యదర్శి సామన ప్రహ్లాదు, కామేడ్ సుబ్బారావు బియ్యంకోసం ఆమిల్లుకు వెళ్ళి అక్కడున్నగాని, కృష్ణకాటుకలు గాని ఒకబస్తా ఇవ్వమని కోరారు గుమాస్తా ప్రెగడ సూర్యనారాయణమూర్తి తమదగ్గర ఏబియ్యమూ లేవని కసిరాడు. కాని బియ్యం నిలవవున్నట్లు లైసెన్సుబోర్డు స్పష్టంగా తెలుపుతూనే వుంది లోగడ కేసు పెట్టించారనే అక్కసుకొద్దీ, అగుస్తా అలా కసిరాడు. వెంటనే కామేడ్సిద్దరూ రెవిన్యూ ఇన్స్పెక్టరు గారివద్దకు వెళ్ళి రిపోర్టుచేశారు. ఆయన గుమాస్తాను పిలిపించి ఏయేరకాల బియ్యం ఉన్నాయని అడుగుతే, పచ్చిబియ్యం ఏ మాత్రం లేవని దబాయించాడు. రెవిన్యూ ఇన్స్పెక్టరు వెళ్ళి మిల్లు సోదా చేయగా, 101 బస్తాల అక్కడున్న, పచ్చిబియ్యం నిలవ బయటపడింది. ఆయన స్టేటుమెంట్లు తీసుకు వెళ్ళారు.

సవరణ

క్రిందటి సంచికలో "బందరు కాలేజీలో అక్రమాలు" అనే శీర్షిక క్రింద ప్రచురింపబడిన వ్యాసంలో యు. ఆర్. ఎం. ప్రసాదు అనే విద్యార్థి సోషల్ గేదరింగ్‌లో కాలేజీలో జరిగే అక్రమాలనుగూర్చి మాట్లాడినట్లు, ప్రిన్సిపలుగారు అతన్ని కాలేజీనుంచి పంపివేసినట్లు వ్రాయబడింది. ఆ విద్యార్థి యు. ఆర్. ఎం. ప్రసాదు కాదు. డి. నాగభూషణం.

ప్రజాశక్తి

ఫ్రాన్సు స్వాతంత్ర్య సమరంలో భారతీయుని ఆత్మార్పణ

స్వాతంత్ర్యారాధకునికి ఏదేశ ప్రజల స్వాతంత్ర్య పోరాటమయినా పవిత్రమే. ఆత్మార్పణకు అర్హమే. విశ్వమానవ స్వాతంత్ర్యమే తన స్వాతంత్ర్యంగా భావిస్తాడు నిజమైన స్వాతంత్ర్య యోధుడు. చైనా కొండల్లో ఉన్న డాక్టరు కొట్నీస్ (చైనాకు కాంగ్రెసు పంపిన వైద్యదళంలో ఒక డాక్టరు) సమాధి ఈ సందేశాన్నే దిగంతాల చాటుతూంది. స్పెయిన్ భూముల్ని తడిపిన 'అంతర్జాతీయ దళ' యోధుల నెత్తుటకాల్వలు ఈ ఆదర్శాన్నే విశ్వశ్రేయోభిలాషుల హృదయాల్లో అంకురింపజేశాయి. ఈ అమర జీవుల్లోకే చేరాడు, సోదర భారతీయుడు యం. మాధవన్.

మాధవన్ పుట్టుక కేరళ రాష్ట్రంలో. సముద్రతీరప్రాంతమైన మాహిఅనేఒకఊరు. అది ఫ్రెంచి ప్రదేశం. అక్కడి కాలేజీలో అతని తండ్రి హెడ్మాస్టరు. మాధవన్ పాండిచెరీలో పట్టభద్రుడయాడు. డాక్టరు పరీక్షకు చదవడం ప్రారంభించాడు.

ఈ పరీక్షకు చదువుతున్న రోజుల్లోనే మాధవన్ జీవితంలో కొత్త చైతన్యం కలిగించిన సంఘటన ఒకటిజరిగింది. 1936 లో ఒకనాడు పోలీసులు ఒక కార్మిక ప్రదర్శనం మీదకుపాకులు కాల్చడంమాధవన్ చూచాడు. దెబ్బలుతిన్నవారు కొందరు కాళ్ళీడ్చుకుంటూ వైద్యసహాయంకోసం తాను చదువుతూన్న మెడికల్ కాలేజీకి వచ్చారు. కాని అక్కడి అధికారులు నిర్దాక్షిణ్యంగా కసిరికొట్టారు. మాధవన్ రక్తం ఉడికిపోయింది. వెందు ఉద్రేకంతో ఈ అమానుష ప్రవర్తనను ఖండించాడు. వెంటనే అధికారు లతనిని కాలేజీనుంచి వెళ్లగొట్టారు.

★

అది మాధవన్ వైద్య వృత్తికి స్వస్తి వాచకం. కాని స్వాతంత్ర్య యోధునిగ అతని జీవితానికి నాందీ పలుకుకూడ అదే. ఆ నాటి నుండి మాధవన్‌కి కార్మికోద్యమంతో సన్నిహిత సంబంధం ఏర్పడింది.

1937 లో మాధవన్ ప్రభుత్వపు స్కాలర్షిప్పుమీద, భౌతిక శాస్త్రంలో పరిశోధనలు చేయడానికి పారిస్‌నగరం వెళ్ళాడు. అక్కడికి వెళ్ళీవెళ్ళడంతోనే అతనుచేసిన మొట్టమొదటి పనేమిటో తెలుసా? ఫ్రెంచి ఇండియాలో అధికారులు పౌరసత్వ హక్కుల నెలా అణగద్రొక్కుతున్నారో వివరిస్తూ ఫ్రెంచి ప్రభుత్వానికొక మెమోరాండం సమర్పించారు. దీనికి ప్రతిఫలం - అతనిని యూనివర్శిటీనుంచి వెళ్లగొట్టారు. ప్రభుత్వం స్కాలర్‌షిప్పును కూడ రద్దుచేసింది.

దానితో మాధవన్ కాలేజీ చదువుకు తిలోదకాలిచ్చాడు. ప్రజాసేవకు కంకణంకట్టాడు. పారిస్‌లో 'సరస్వతీ సంఘం' అని ఒక రాజకీయ సంఘాన్ని నిర్మించాడు. ఆసియాలోని ఫ్రెంచి వలసదేశాల ప్రజల శ్రేయస్సుకోసం పాటుపడడమే దీనిఆశయం. 1938లో పండిత జవహర్లాల్‌నెహ్రూ పారిస్ వెళ్ళినప్పుడు - వారికి జరిగిన అఖండ సన్మానానికి కారకుల్లో మాధవన్ ఒకడు.

★

1939 వచ్చింది. దానితో యుద్ధం చూస్తూండగానేఫ్రాన్సు పతనమయిపోయింది. నాజీ ఇనుప పాదాలు పారిస్ నగర వీధుల్ని మలినం చేశాయి.

ఆ రోజుల్లో మాధవన్ దక్షిణ ఫ్రాన్సులో ఉన్నాడు. తాను తలచుకొంటే ఆయుద్ధబీభత్సాలనుండి తప్పించుకొని, తన మాతృదేశానికి చేరుకునేవాడే; కాని, స్వాతంత్ర్యప్రియులయిన ఫ్రెంచి జనసామాన్యం దుష్ట నాజీ శక్తుల గుప్పిట్లో చిక్కుకొని, అల్లాడిపోతూంటే తాను పారిపోగలడా? తన జీవితాదర్శానికే అదిభిన్నంఅని ఎంచాడుమాధవన్.

రహస్యంగా పారిస్ వెళ్ళాడు. తానెరిగున్న విద్యార్థులందరినీ రహస్యంగా కలుసుకున్నాడు. నాజీలను ముప్పతిప్పలుపెట్టి మూడుచెరువుల నీళ్ల తాగించాలనే దీక్షతో, వారంతా కలసి గెరిల్లా దళంగా ఏర్పడ్డారు. త్వరలోనే వీరికీర్తి వివిధప్రాంతాలకు వ్యాపించింది. భారత పుత్రుడయిన మాధవన్ ఫ్రెంచి ప్రజలకు ప్రియమైన సోదరుడయాడు. అతనిపేరు విన్నవారంతా అతని పట్ల ఎంతో గౌరవాన్ని, అభిమానాన్ని వెల్లడించారు.

తన పవిత్ర కార్యభారాన్ని నిర్వహించడంలో మాధవన్ ఎలాంటి కష్టాలకయినా వెనుదీయలేదు. ఒక్కొక్కసారి నెలమొత్తంలో అతను 12 సార్లే భోజనంచేసేవాడట. గెరిల్లా ఉద్యమ నాయకులతనిని అతిత్వరలోనే కెప్టెన్ స్థానానికి ప్రమోట్ చేశారు. పారిస్‌లో ఒక పేటలోని ఉద్యమానికి అతనినే నాయకునిగ నియమించారు.

1942 - సెప్టెంబరు 22 వ తేదీని పారిస్‌కి కొద్దిదూరంలో ఢీప్ అనేచోట మాధవన్, అతని నాయకత్వాన 20 మంది ఫ్రెంచి గెరిల్లా యువకులు, నాజీ మృగాలతో తలపడ్డారు. తప్పించుకొనిపోయే మార్గం లేదు. కొనఊపిరి ఉన్నంతవరకు నాజీలపై దెబ్బతీయడమే వారి సంకల్పం. ఆ పోరాటంలో ఆ వీరపుంగవు లందరూ ప్రాణాలు విడిచారు, చనిపోవునాటికి మాధవన్‌కి 27 ఏళ్ళ వయసే.

ఫ్రెంచి స్వాతంత్ర్య యోధుల హృదయాల్లో భారతపుత్రరత్నం మాధవన్ అమరస్థానం సంపాదించు కున్నాడు.

('ది స్టూడెంటు' నుండి)

కాంగ్రెసు - లీగులకు సమాన ప్రాతినిధ్యం ఉండాలి

★

లీగు నాయకుని ప్రకటన

లాహోరు, ఆగస్టు 4

పంజాబురాష్ట్ర ముస్లింలీగ్ యాజమాన్యాన, యిక్కడ జరిగిన బహిరంగసభలో రాష్ట్ర ముస్లింలీగ్ ప్రధానకార్యదర్శి మియాఁ ముంతాజ్ దౌలతానా ఎం.ఎల్.ఏ.గారు ఉపన్యసిస్తూ, సిమ్లా సమావేశం భగ్నమవడానికి వేవెల్ ప్రభువే కారణమన్నారు. కాంగ్రెసు-లీగ్ లకు సమాన ప్రాతిధ్యం ఉండడమే సరియైనపద్ధతి అన్నారు. అప్పుడే ప్రతిష్టంభనను వదలించి తాత్కాలిక కేంద్రప్రభుత్వాన్ని నిర్మించవచ్చు నన్నారు. కాని, సామ్రాజ్యవాదుల ఏజంటైన వేవెల్ ప్రభువు "హిందూ ముస్లింలకు సమాన ప్రాతినిధ్యం ఉండాలంటూ, యుక్తిగా మొదటి సూచనను (దేశాయి - లియాఖత్ ఒడంబడిక - సం.) మార్చివేశాడు." ఈ విధంగా, కాంగ్రెసూ ముస్లింలీగూ ఏకాభిప్రాయానికి రావడం అసాధ్యమయేలా గందరగోళం కలుగజేశాడు.

దౌలతానాగారు ఇంకామాట్లాడుతూ, "కాంగ్రెసు దేశంలో రాజకీయ చైతన్యం కలిగించి, స్వాతంత్ర్యవాంఛను పెంపొందజేసి" నందుకు ప్రశంసించారు. జాతీయ ముస్లింలు దేశ స్వాతంత్ర్యానికి అమోఘమైన త్యాగాలు చేశారన్నారు. కాని, యీ రోజున పరిస్థితులు ఇంకా మారాయి. ముస్లింలీగు భారతదేశ ముసల్మానుల జాతీయ సంస్థగా అభివృద్ధి చెందింది. జాతీయ ముస్లింలు కూడా యీ మార్పును గమనించి, తమ దృక్పథాన్ని మార్చుకోవలసియుంటుందన్నారు. కాంగ్రెసుకి - ముస్లింలీగ్‌కూ మధ్య రాజీ చేయడానికి వారుప్రయత్నించాలని ఉద్బోధించారు.

— యునైటెడ్‌ప్రెస్ ఆఫ్ ఇండియా.

పుస్తక పరిచయం

"గేయావళి", "జిగీష", "ఆదిమాంధ్ర జాతీయగీతోదయం", ఈ మూడూ నిమ్నజాతి ప్రజలను ప్రబోధింపుతూ వ్రాసిన గేయాలు. నిమ్నజాతులనీ, అస్పృశ్యులనీ ఆదిమాంధ్రులనీ, హరిజనులనీ పిలువబడే కష్టజీవులు సాంఘికంగాను, ఆర్థికంగాను తరతరాలుగా పీడించబడుతూ వచ్చారు. వీరికి జరుగుతున్నలాంటి అన్యాయం, దోపిడి నశిస్తేగాని - ఏదేశానికిగాని, ఏజాతికిగాని సుఖశాంతులుండవు. సంఘ చైతన్యంలేనిదే ఏ జాతీ, ఏవర్గమూ తన కష్టాలను నివారించుకోలేదు. అందుచే ఇటీవలనే సంఘీభావం పెంపొందించుకొని తమ కష్టనివారణకు, తమ హక్కులను పొందడానికి నిమ్నజాతులు చేస్తున్న కృషినీ, ఆశయాలనూ ఈ గేయాలు ప్రతిబింబిస్తున్నాయి.

"గేయావళిని హరిగారు రచించారు. ఇవి అంబేద్కరు ఆంధ్రదేశసంచారం చేసినపుడు వ్రాసిన గేయాలు అందుచేఅంబేద్కరు నామం, పూజ - ప్రతి గేయంలో కనపడుతుంది. అయినా, గేయాలలోని ముఖ్యవస్తువు నిమ్నజాతి ప్రజలను ఉద్బోధించునదే.

ఉదా:

"పూని మ్రోయించు రణభేరి కూలన్నా
తాతతండ్రులు నీకు దాచిన ఆస్తులా?
వస్తువాహనములా? మేడలా మిద్దెలా?
ఏవి పాడవుతాయి? దేనికో యీ నీరికి?
లేలెమ్ము వేగమే కూలన్నా! లేచి
నడుము బిగియించవోయ్! కూలన్నా"

★

"జిగీష" వివిధ రచయితల గేయాల సంపుటి, శ్రీ శ్రీ "మరో ప్రపంచ" ధోరణిలో భద్రయ్యగారు వ్రాసిన "జ్వాల" ఉజ్వల దీప్తిని వెలిగిస్తుంది.

"భూమికి అడుగున బుస్సలుగొట్టే
ఆదిశేషుని ఆశాంతి కీలలు
వేయిపడగలే విప్పారాయోయ్
సుప్త పాతాళ గుప్త ప్రపంచం
బదబద బదబద పగిలిందోయ్"

అని కష్టజీవుల ఆశాంతి అనే అగ్ని పర్వతం బద్దలు అయిందంటున్నారు.

'వంకి ర్తనంలో

"మలిన పథములెల్లమార్చి మంచి త్రోవ జూపుదాం
జన్మహక్కు స్వేచ్ఛకొరకు సమర భూమి కేగుదాం"

అని తమ ఆశయాన్ని వెలిబుచ్చారు.

★

వంబూరి భద్రప్ప రచించిన "ఆదిమాంధ్ర జాతీయ గీతోదయం", "మేలుకో, మేలుకో ఓ ఆదిమాంధ్రా! మత్తునిద్దురమాని మేలుకోవోయీ" అని ప్రబోధించుతుంది. "వైరికేక లిడమని "కత్తి నీచేతిలో కదిపించవన్నా దన్న మోహమేలేదని", "కత్తినదుముగా మారమనీ" అక్కడక్కడా కటువుగా చెప్పడం కన్పించుతోంది ఈగేయాలలో.

ఈనాడు కార్మిక కర్షక వర్గాలలో ప్రచారమవుతున్న ప్రబోధగేయాల పక్కలలో ఈ గేయాలు రచించబడినాయి. రచయితలంతా నిమ్నజాతులకు చెందినవారే. ఇది వారి చైతన్యాన్ని తెలియజేస్తోంది.

★

"గేయావళికి" వాడపల్లి ఆశ్రమం - రామచంద్రపురం, తూర్పుగోదావరిజిల్లా అని.

"జిగీష"కు ప్రబోధ సాహిత్యసమితి - రాజమండ్రి అని.

"ఆదిమాంధ్ర జాతీయ గీతోదయం"కు హరిజనఅండ్‌కో., బెజవాడ-అనివ్రాయాలి.

స్వీకారం

అంజలి: (కథాసంపుటి)
రచయిత: శ్రీ అడివి బాపిరాజు.
వెల: రూపాయిన్నర

ప్రతులకు: కళాపీఠము నాంపల్లి, హైదరాబాదు - లేక నవ్యగ్రంథ విక్రయశాల, బ్రాడీపేట, గుంటూరు - అని వ్రాయాలి.

★

శ్రీ లలితాపుష్పమాల: (ఖండకావ్యం)
రచయిత: శ్రీ రత్నాకరం వెంకటేశ్వర్లు
వెల: 0-8-0

ప్రతులకు: రచయితపేర ధర్మవరం, అనంతపురంజిల్లా అని వ్రాయాలి.

★

జైలు! (కథలసంపుటి)
రచయిత: శ్రీ పొట్లపల్లి రామారావు
వెల: రు. 0-8-0

ప్రతులకు: ఆంధ్ర పబ్లిషింగ్ కంపెనీ, సుల్తాన్ బజారు, హైదరాబాదు, దక్కన్. అని వ్రాయాలి.

"కామ్రేడ్స్, అమెరీపదవీ భ్రష్టు డయ్యాడు. బ్రిటిషు కార్మికవర్గము అమెరీని తొలగించింది."

ఈ విజయవార్తతో అఖిలభారత ట్రేడుయూనియను కాంగ్రెసు యొక్క జనరల్‌కౌన్సిలుసమావేశం కలకత్తాలో ప్రారంభమైంది. బ్రిటిషు టోరీవర్గం హయాములో, అమెరీ ఇండియాపై పెత్తనము చేసేటప్పుడు యీ కలకత్తాలోనే ప్రజలు ఎంత యమయాతనలు అనుభవించారో. సమావేశంలో పాల్గొను చున్న కార్మిక యూనియను ప్రతినిధులు కండ్లార చూచారు. అఖిల భారత ట్రేడుయూనియను కాంగ్రెసు నాగపూరులో జరిగిన తర్వాత మొదటి జనరల్ కౌన్సిలు సమావేశం కలకత్తాలో 1943 లో జరిగింది. అప్పటి కలకత్తా దృశ్యము యిప్పటికింకా నా కండ్లముందరుంది. వందలకొలది ప్రజలు తిండిలేక, యీ మహాపట్టణములో రోడ్లమీద పక్షులు రాలిపోయినట్లు చనిపోయారు. తిండిదొంగలు, అమెరీవర్గము మన దేశముపై పెత్తనం చేయడం మూలంగా మన సోదర ప్రజలు మృత్యుదేవతకు బలి అవుతుంటే, నా గుండె తరుక్కుపోయింది. ఏ అమెరీ మూలంగా 35 లక్షల బెంగాలు ప్రజలు బలి అయ్యారో, ఆ అమెరీనే నేడు బ్రిటిషు కార్మికవర్గం ఓడించింది. అంతేకాదు. బ్రిటిషు కార్మికవర్గము అమెరీ, చర్చిలు వర్గాన్నంతటినీ ఓడించింది. లేబరుపార్టీకి అధికారం వచ్చింది. హిట్లరుఓటమి తర్వాత, బ్రిటనులో ఈచర్చిలు వర్గముయొక్క ఓటమి స్వాతంత్ర్యం కోరే ప్రజాసీకానికంతా, ప్రధానముగా కార్మికవర్గానికి, గొప్ప విజయము.

ఇటువంటి పరిస్థితుల్లో అఖిల భారత ట్రేడుయూనియన్ కాంగ్రెసుయొక్క జనరల్ కౌన్సిల్ సమావేశం జూలై 27, 28 తేదీలలో జరిగింది. అన్ని రాష్ట్రములనుండి 82 రు కౌన్సిలు సభ్యులు సమావేశమయ్యారు. వివిధ పార్టీల ప్రతినిధులు— కమ్యూనిస్టులు, కాంగ్రెసువారు, ట్రేడుయూనియనిస్టులు, కాంగ్రెసుసోషలిస్టులు, లేబరుపార్టీవారు - అంతా హాజరయ్యారు. అఖిల భారత ట్రేడుయూనియన్ కాంగ్రెసు భారతకార్మికులందరియొక్క ఏకైకసంస్థగాచేయడానికి పునాదులువేయడంలోను, భారత కార్మికుల హక్కులను కాపాడ్డంలోను, భారత స్వాతంత్ర్యోద్యమానికి అండగా వుండేటట్లు చేయడంలోను, కమ్యూనిస్టులు అఖిల భారత ట్రేడుయూనియను కాంగ్రెసులో ప్రధానపాత్ర వహిస్తున్నారు.

జనరల్ కౌన్సిలు సమావేశం కామ్రేడ్ మృణాలకాంతి బోసుగారి అధ్యక్షతక్రింద జరిగింది.

బ్రిటిష్ సైనికుల సందేశం

బ్రిటిషు సైనిక కామ్రేడ్సు అఖిల భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసుకు సందేశం పంపుతూ, బ్రిటిషు శ్రామికజన భారతప్రజలతో కలసి భారత స్వాతంత్ర్యానికి కృషి చేస్తుందని చెపుతూ, బ్రిటిషు లేబరుపార్టీ విజయం శుభసూచకమని తెలిపారు. అధ్యక్షులు సైసందేశాన్ని చదివారు.

కార్యదర్శి కామ్రేడ్ ఎన్. ఎమ్. జోషి రిపోర్టులో యీ దిగువ సంగతులు తెలిపారు. మదరాసు కాన్ఫరెన్సుతర్వాత ఆంధ్ర, అస్సాం మధ్యపరగణాలు, పంజాబు ట్రేడుయూనియన్ కాన్ఫరెన్సులు జయప్రదంగా జరుపబడ్డాయి. అఖిల భారత ట్రేడ్‌యూనియన్ ప్రతినిధులు ఢిల్లీలో జరిగిన లేబరుకమిటీ

సత్వరమే ఎన్నికలు జరపాలి

అఖిలభారత ట్రేడ్‌యూనియన్‌కౌన్సిల్‌లో తీర్మానాలు

సి. వి. కె. రావు

8 వ సమావేశానికి హాజరై, ప్రభుత్వం తీసుకువచ్చిన ఆరోగ్య యిన్సూరెన్సు స్కీమును చర్చించారు. అంతర్జాతీయ లేబరు ఆఫీసు ప్రతినిధులను కలుసుకొని, ఆరోగ్యస్కీముకు ప్రతిపాదనలు సూచించారు. బొగ్గు గనులలో పనివారల సహాయ సలహాకమిటీకి ఎ. ఐ. టి. యు. సి. ప్రతినిధులు సూచింపబడ్డారు. బొంబాయి గవర్నమెంటు జీతాల బట్వాడా చట్టముమీద తీసుకువచ్చిన సవరణలను నిరసిస్తూ ఒకమెమోరాండం పంపబడింది. గవర్నమెంటు టెక్నికల్ విద్యా కమిటీలోను, పాలసీ కమిటీలోను, పారిశ్రామిక ప్లానింగు కమిటీలలోను ఎ. ఐ. టి. యు. సి. ప్రతినిధులను తీసుకొన్నారు. అఖిలభారత ప్రెస్ కార్మికుల సభ, ఇంజనీరింగు సభలు కలకత్తాలో జరుపబడతాయి. అఖిల భారత మునిసిపల్‌వర్కర్ల సభ బెజవాడలో నవంబరులో జరుపబడుతుంది. అఖిలభారత షాప్‌ఎంప్లాయీస్ సభ ఢిల్లీలో జరుపబడును.

కొత్తయూనియన్ల అఫిలియేషన్లు

రాయిస్టులు ప్రభుత్వ గులాములుగా పనిచేస్తూ, బొమ్మ పుచ్చు కొని కార్మిక సంఘాలలో చీలపుడుగులవలె పనిచేయడాన్ని అసహ్యించుకొన్న అహ్మద్‌నగర్ తననావికాకార్మిక సంఘాన్ని ఐ. ఎఫ్. ఎల్. (రాయిస్టు ఇండియన్ ఫెడరేషను ఆఫ్ లేబరు) నుండి తప్పించి, అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుకు అఫిలియేటుచేయుటకు మదరాసు సమావేశములోనే దరఖాస్తు పెట్టారు. ఆ యూనియనుయొక్క సభ్యత్వము 34 వేలు. కలకత్తాలో పై యూనియన్ రికార్డులను పరిశీలించి, 34,000 సభ్యత్వాన్ని అంగీకరిస్తూ నావికా కార్మిక యూనియనును అఫిలియేటు చేసుకున్నారు.

దీన్నిబట్టి ట్రేడ్‌యూనియన్ ఉద్యమము యొక్క ఐక్యతను కాపాడాలనే సదుద్దేశము ఉన్నదో, ప్రాతినిధ్యము గలిగిన సంఘాలన్నిటిని గుర్తించి, ఎ. ఐ. టి. యు. సి. తనలో చేర్చుకుంటుంది.

అఫిలియేటు కాబడు యూనియన్ల సభ్యత్వం సక్రమంగా ఉన్నట్లు రుజువుకావడానికి రిజిష్ట్రేషను. అఫిలియేషనుకు కావలసిన రూల్సు తయారుచేశారు.

ప్రపంచ కార్మికసంస్థలలో ప్రాతినిధ్యం

యూరపులో ఫాసిజం అంతం కావడంతో బ్రహ్మాండమైన ప్రపంచ కార్మికోద్యమమునకు పునాదులు పడ్డాయి. 1944 లో ప్రపంచ ట్రేడ్‌యూనియన్ల సమావేశం లండనులో జరిగింది. ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు తరపున కామ్రేడ్ డాంగే, అద్దేకరు, ఇంకొకరు హాజరయ్యారు. పారిస్‌లో జరుగబోవు ప్రపంచ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు సమావేశానికి భారతకార్మిక ప్రతినిధులుగా కామ్రేడ్ డాంగే, అద్దేకర్లను ఎన్నుకొన్నారు. ఈ సంస్థ యొక్క కార్యనిర్వాహక వర్గంలో ఒక భారత కార్మిక ప్రతినిధిని తీసుకోవాలని కోరారు. అదే సమయంలో పారిసులో అంతర్జాతీయ లేబరు ఆర్గనైజేషను (ఐ. యల్. ఒ.) 12 వ సమావేశం జరుగుతుంది. దానికి ప్రతినిధిగా కామ్రేడ్ యన్. యం. జోషీని, సలహాదార్లుగా యస్. యన్. మిరాజకర్, అబ్దుల్ మొమీన్, అద్దేకర్, శివనాథ బెనర్జీగారలను ఎన్నుకొన్నారు. అంతర్జాతీయ ఆర్గనైజేషను యొక్క పారిశ్రామిక కమిటీలకు కూడ ప్రతినిధులను ఎన్నుకొన్నారు. ఈ విధంగా భారతకార్మికుల ఏకైక సంస్థయగు ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు అంతర్జాతీయ సంస్థలలోను, ప్రభుత్వ కార్మిక కమిటీలలోను గుర్తించబడుతోంది. ప్రభుత్వమెంత మద్దత్తు చేసినప్పటికీ, రాయిస్టుల ఫెడరేషను యొక్క కృత్రిమ స్వరూపం దాగుటలేదు.

రాయిస్టుల తహతహ

ఈ పరిస్థితుల్లో రాయిస్టు ఫెడరేషను యొక్కజీవితపు గడువు తక్కువగా ఉంది. ఏదోవిధంగా ఎ. ఐ. టి. యు. సి. చే గుర్తించబడాలనే ఉద్దేశంతో త్రైపార్టైయిట్ కాన్ఫరెన్సుకు ముందు ప్రతిసారి లేబరు సమస్యలను కలసి చర్చించవలెననే ఉద్దేశాన్ని తెలియజేస్తూ ఐ. యఫ్. యల్. కార్యదర్శి (రాయిస్టు) కామ్రేడ్ యన్. యం. జోషీకి జాబులు వ్రాశారు. ఇది చర్చకు వచ్చింది. రాయిస్టులను ఏవిధంగాను గుర్తించదలచుకోలేదని సమాధానం వ్రాయుటకు ఎ. ఐ. టి. యు. సి. వర్కింగు కమిటీ నిర్ణయించింది.

తీర్మానాలు

బ్రిటిషు కార్మికుల బ్రహ్మాండమైన విజయాన్ని ప్రశంసిస్తూ, చర్చిలు, అమెరీవగైరా దుష్ట సామ్రాజ్యవాదుల హయామును అరికట్టడము, బ్రిటిషు కార్మికుల విజయమేకాక, భారత కార్మికులకూడ విజయమని చాటుతూ, యీ అవకాశాన్ని బ్రిటిషులేబరుపార్టీ పూర్తిగ ఉపయోగించి భారత ప్రజల స్వాతంత్ర్యాన్ని గుర్తించి వలసరాజ్యాలలోని బానిసవిధానాన్ని అంతమొందించాలని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈతీర్మానాన్ని ఎ. ఐ. టి. యు. సి. జనరలు కౌన్సిలు లండనుకు కేబిల్ పంపింది. ఎర్రసైన్యంయొక్క అకుంఠిత ధైర్యాన్ని కొనియాడుతూ, యూరపును ఫాసిస్టు దానిసత్వాన్నుండి కాపాడబడిన విముక్త దేశాలను అభినందిస్తూ మరొక తీర్మానం చేయబడింది. యూరపులో కార్మిక సంస్థలు బలపడడాన్ని ఆమోదిస్తూ, ప్రజాస్వామిక సూత్రాలను ఆచరణలో పెట్టాలని, ప్రధాన పరిశ్రమలు ప్రభుత్వవశములో ఉండాలనీ, కోరుతూ బ్రిటిషు అభివృద్ధినిరోధకులు తిరిగి తమ సామ్రాజ్యాధికారాలను చెలాయించకుండా అరికట్టాలని తీర్మానించారు.

తరవాత రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టబడింది. తీర్మానము యొక్క సారాంశమిది: సిమ్లాసమావేశం విఫలం కావడంవిభారతకమైనవిషయం. కాంగ్రెసు లీగులమధ్య ఒడంబడిక కుదిరేటట్లయితే ప్రతిష్టంభనపరిష్కారమయ్యేది. ఈసమావేశం విఫలంకావడం మూలంగా ప్రజలు ఒకరిపై నొకరునేరాలు మోపుకొనకుండా కమ్యూనిటీలమధ్య స్నేహమును పరస్పర విశ్వాసమును, కాపాడుకోవాలని హెచ్చరించారు. రాష్ట్రాల్లోను, కేంద్రంలోను సత్వరమే ఎన్నికలుజరపాలి. ప్రభుత్వంకాంగ్రెసుసంస్థపై నిషేధము తొలగించాలి. రాజకీయ ఖైదీలను విడుదలచేయాలి. రాష్ట్రీయ మంత్రివర్గాలు ఏర్పడి ప్రజా క్షేమకరమగు కార్యక్రమమును నడిపించాలి. భారతదేశ కార్మికవర్గం మతకలహాలకు లోనుకాకుండా, ఐక్యతను కాపాడుకొంటూ, ప్రజలకై పరిష్కారమార్గమును సాధించి గమ్యస్థానమును చేరుకొనుటకు సాయపడాలని హెచ్చరించబడింది.

ఈ తీర్మానాన్ని కాంగ్రెసువాదుల తరపున వి.ఆర్. కాలప్పగారు ఎదుర్కొన్నారు. సిమ్లాసమావేశంయొక్క ఓటమికిబాధ్యతతమదికాదన్నారు. ఐక్యతను కాపాడుకోవాలని ప్రజలను హెచ్చరించవలసిన అవసరము లేదన్నారు. కార్మికులను మతకలహలకు లోనుకాకూడదని చెప్పడమే మతకలహలను తీసుకురావడమన్నారు.

అవలు తీర్మానాన్ని ఎదుర్కొంటూ పోటీగా వేరొక రాజకీయ తీర్మానాన్ని కాలప్పగారు తీసుకువచ్చారు. మొదటి తీర్మానములో తాను ఎదుర్కొన్న సంగతులను తొలగించి రాష్ట్రీయ మంత్రివర్గాలగురించి తలపెట్టకుండా తన తీర్మానాన్ని ఉపపాదించారు.

మొదటి తీర్మానాన్ని ఓటింగుకు పెట్టగా, 64 గురు అనుకూలంగాను, 28 గురు వ్యతిరేకంగాను, వోటుచేసారు. తీర్మానానికి అనుకూలంగా 100 కి 67 వోట్లు వచ్చాయి. ఎ. ఐ. టి. యు. సి. నిబంధనలనుబట్టి 100 కి 75 వోట్లు రాజకీయ తీర్మానానికుండాలి. అందుచేత ఎ. ఐ. టి. యు. సి. లోపై తీర్మానము ప్యాసుకాలేదు.

అధ్యక్షుడు మృణాలకాంతిబోసుగారు వేరొక తీర్మానము అందరికీ ఆమోదమైన సంగతులపై తీసుకువచ్చారు. కాంగ్రెసుపై నిషేధం తొలగించాలని, రాజకీయ ఖైదీలందరినీ విడుదలచేయాలని, రాష్ట్ర కేంద్రశాసన సభలకు సత్వరమే ఎన్నికలు జరగాలని. దీని సారాంశం ఈతీర్మానం ఏకగ్రీవంగా ఆమోదింప బడింది.

బట్టల కరువు

బట్టల కరువునుగూర్చి తీర్మానమొకటి ఏకగ్రీవంగా ఆమోదింపబడింది. ప్రజలు ప్రజా సంఘాలద్వారా బట్టల వర్తకములో దొంగ మార్కెట్టు, అధికలాభాలు అరికట్టాలని. బీద ప్రజలకు అందుబాటులో ఉండేటట్లు బట్టల ధరలు తగ్గించాలని; జనసామాన్యము యొక్క అవసరాలు తీర్చడానికి ఎక్కువ గుడ్డను విడుదల చేయుటకు ఎగుమతులను తగ్గించి, సైనిక అవసరాలకు ఇతర దేశాలనుండి దిగుమతి చేయాలనీ; కార్మిక సంస్థల సహకారంతో, వారి హక్కులను గుర్తించి, బట్టల ఉత్పత్తిని అధికము చేయాలని; పంపక విధానములో ప్రజాప్రతినిధులను చేర్చుకొని బట్టల రేషనింగును దేశమంతటా అమలు జరపాలనీ - తీర్మానముయొక్క సారాంశము. మొదటిసారిగా ఎ. ఐ. టి. యు. సి. బట్టల కరువును ఎదుర్కొ (మిగతా 7వ పేజీలో)

సింధియా యూనియన్ పరిస్థితులు

తమ నాయకునిపట్ల కార్మికుల అచంచల విశ్వాసం

కామ్రేడ్ భద్రం సింధియాషిప్‌యార్డు లేబరు యూనియన్ కార్యదర్శిగా తొలగింపబడ్డాడని పత్రికల్లో చూచి - ఆశ్చర్య పడ్డాం. రెండుకదవలజనరల్‌బాడీ మీటింగులో ఏకగ్రీవంగా యెన్నుకోబడ్డాడు భద్రం. కార్యనిర్వాహక వర్గం సమావేశమై భద్రాన్ని కార్యదర్శిపదవినుండితొలగించుచూతీర్మానించిందనినేటప్పటికి కొంత అనుమానంకలిగింది. ఈ యూనియన్ చరిత్ర ఈ అనుమానాలకుదోహదం ఇచ్చింది. షిప్‌యార్డు లేబరు యూనియన్, కంపెనీ యూనియన్‌గానే ఉద్భవించింది. కంపెనీ చెప్పుచేతలందు వుంటున్న యూనియన్ వుద్యోగులు కార్మికుల కష్టాలకై కృషిచేయకాలనందున కార్మికులంతా అసంతృప్తిచెంది తమ విశ్వాసమును చూరగొన్న కమ్యూనిస్టుని (భద్రాన్ని)కార్యదర్శిగా యెన్నుకున్నారు. దీనితో కంపెనీ సన్నాగంపటాపంచలయింది. కార్మికులు కంపెనీ యూనియన్ స్వభావాన్నే మార్చి, తమ హక్కులకై కృషిచేయు సంఘంగా అభివృద్ధి చేసుకున్నారు.

మేనేజిమెంటు కుట్ర

కంపెనీ మేనేజిమెంటు దీనిని సహించలేక యూనియనులో తమవద్ద పనిచేయువారుండరాదని యీసడించారు. కంపెనీ డబ్బు తింటూ పనిచేస్తున్న లేబరు ఆఫీసరు కార్మికులపై ఒత్తిడి తెచ్చారు. కార్మికులదగ్గర యీ ఆటలు సాగలేదు. యజమానులు వద్దని శాసించినా వీరు ధైర్యంతో భద్రాన్ని రెండవ తడవకూడ యెన్నుకున్నారు.

దానితో కంపెనీ మేనేజిమెంటు సామదాన భేద దండోపాయాలను నాలుగింటిని ఒక్కుమ్మడి ప్రయోగించారు.

ఈ యూనియన్‌కు అధ్యక్షుడు కామేశ్వరరావుగారను ఒక గుమాస్తా. కార్మికులకు వీరిపై విశ్వాసంలేదు. యూనియన్ వీరి చేతుల్లోనేవుంటే తమ కోర్కెలను బలపరచదని భయపడి, కమ్యూనిస్టుని కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కాని అధ్యక్షుని తొలగించవలసిన అవసరాన్ని యీ కార్మికులు గుర్తించలేకపోయినారు.

అధ్యక్షునిపై యజమానుల ఒత్తిడి అధికమైంది. కార్యదర్శిని తొలగించాలని లేబరు ఆఫీసరు ఒక అల్టిమేటం అధ్యక్షునకు జారీ చేశారు. కాని అధ్యక్షుడు కార్మికులయెదుట కార్యదర్శిని తొలగించాలని ధైర్యంగా చెప్పలేకపోతున్నారు. కార్యదర్శిని తొలగించాలంటే తన స్థానమే వూడిపోతుందని అధ్యక్షునికి తెలుసు.

కాంగ్రెసువాదుల ప్రవర్తన

ఇంతలో స్థానిక కాంగ్రెసువాదులు కంపెనీ మనిషి అయిన కామేశ్వరరావుగారికి బోధ చేయటం ప్రారంభించారు.

కంపెనీలో టైముకీపరుగా పనిచేస్తున్న సత్యనారాయణరాజుగారు, బుద్ధిరాజు మల్లికార్జునరావుగారు, తిలక్ గారు ఈ జిల్లాలో కాంగ్రెసు అసెంబ్లీ పక్షాన లేబరు సబ్‌కమిటీగా పనిచేస్తున్నారు. ఈ సత్యనారాయణ రాజుగారు లేబరు ఆఫీసరుతో మంతనాలు ప్రారంభించారు. భద్రాన్ని తీసివేయటానికని కామేశ్వరరావు రాజుగార్లు చేతులుకలిపారు. వీరికి స్థానిక స్త్రీదర్లు సలహాలు యిచ్చారు. కార్మికులలో వీరుస్థానం సంపాదించలేక పోయినారు. స్త్రీదర్లసల హాతో లేబర్ కమీషనర్ సహాయాన్ని అర్థించారు.

ఈ రాజుగారిని కమ్యూనిస్టు వ్యతిరేకత యెక్కడికి తీసుకొని వెళ్ళిందో చూడండి. కంపెనీ యజమానులతో చేతులు కలపటం, ప్రభుత్వ సహాయమునకై ప్రాధేయపడటం.

లేబరుకమీషనర్ జోక్యం

లేబరుకమీషనరు ఆలోచనలుసాగించాడు. యూనియన్ నిబంధనావళిని తిరగేసిచూచాడు. దానిలో బయటవారిని పెట్టుకోవలెనని లేదు కదా. భద్రం బయటవాడు కనుక తీసివేయమన్నాడు. లేబర్ కమీషనరు పక్షపాతదృష్టి వహించాడని చెప్పాలి. యెందువల్లనంటే యీ నిబంధనావళితో బయటవారు వుండరాదని లేకపోగా, గౌరవ కార్యదర్శిని యెన్నుకో వచ్చునని వుంది. ఈ గౌరవ (Honorary) అనే పదం సర్వసాధారణంగా బయటివారికే వుపయోగింప బడుచున్నది. లేబరు ఆఫీసరుగారిచే తయారుచేయబడిన యీ యూనియన్ రూల్సులోకూడ అనరరి సభ్యులని బయటివారికి వాడబడింది.

అంతేకాదు. కార్యదర్శిగా యెన్నుకొనిన వెంటనే భద్రం లేబరు కమీషనరుకు రూల్సు ప్రకారం ఎన్నిక విషయం తెలియపరచాడు. అప్పుడు యేట్టి అభ్యంతరమూ కమీషనర్ తెలియజేయలేదు. నేటికి అభ్యంతరం యజమానుల పెట్టుచున్నారంటే ఒత్తిడియే. వీరు యజమానులపక్షం వహించుటయే కారణం అని స్పష్టమవుతూంది.

పిల్లలమర్రి వెంకటేశ్వర్లు

కార్మికుల చొరవ

భద్రం కార్యదర్శిగా వుండుటకు వీలు లేదన్నారని సాకుచూపి, భద్రానికి నోటీసు పంపకుండానే, అధ్యక్షుడు కార్యనిర్వాహకవర్గ సమావేశం 2-7-45 న కంపెనీ ఆవరణలో జరిపి, భద్రాన్ని తీసివేశామని తెలియపరచారు. కాని వీరికి మరొకగండం దాటవలసి వచ్చింది. ఈ కార్యనిర్వాహకవర్గ తీర్మానాన్ని జనరల్‌బాడీ ఆమోదించవలసివుంది. దీనికితోడు కార్మికులు, కార్యనిర్వాహకవర్గ సూచనను నిరాకరించుచూ తీర్మానం చేయుటకు ప్రత్యేక మీటింగు పిలవవలసిందని నోటీసు యిచ్చారు. కాని కంపెనీ తాబేదార్లకు నిబంధనావళి, డెమాక్రసీ కావాలా? వీరు దీనిప్రకారం సభ జరుపకుండా, 20-7-45న జనరల్‌బాడీ మీటింగు కంపెనీ ఆవరణలోనే పెట్టుటకు ప్రయత్నించారు. కాని కార్మికులు కంపెనీ ఆవరణలో మీటింగు జరుపుటకు వీలు లేదని ఎదిరించి, యూనియన్ ఆఫీసు ఎదుట సభజరపాలని, ఆఫీసుముందు గుమిగూడారు. కాని అధ్యక్షుడువచ్చి సభజరుపుటకు మారుగా సభ వాయిదా వేయబడిందనిచెప్పి, తిరిగి సభ 27-7-45 తేదీన జరుగుతుందని ప్రకటించాడు. మర్నాడు తిరిగి కంపెనీలో సభ జరుపుటకు ప్రయత్నించి సభ ప్రారంభించారు. కాని కార్మికులు కంపెనీలో సభ జరుపుటకు వీలులేదని చెప్పి, మీటింగు జరగనీయలేదు.

భద్రాన్ని తీసివేయుటయే ప్రధానంగా పెట్టుకొన్న అధ్యక్షుడు సమావేశం జరుగకపోయినప్పటికీ, సమావేశం జరిగిందనీ, అందులో భద్రాన్ని తొలగించుటకు తీర్మానించారనీ భద్రానికి నోటీసు పంపాడు. ఈ వార్తవిని కార్మికులు విస్తుపోయారు. కార్మికులు సంతకములుచేసి మీటింగు జరుగలేదనీ, అధ్యక్షునిపై విశ్వాసరాహిత్య తీర్మానం చేయుటకు ప్రత్యేక సమావేశం జరుపవలసిందనీ తిరిగి నోటీసు యిచ్చారు.

అధ్యక్షుడు యింత శ్రమపడ్డందుకు కంపెనీవారు కృతజ్ఞులుగా ఉన్నారనీ, కామేశ్వరరావుకి రు. 15 లు ప్రమోషను యిచ్చారనీ కార్మికులంతా చెప్పుకుంటున్నారు.

కార్మికులపై దాడి

కార్మికులకు వచ్చిన బహుమానాలు చూద్దాం. టైము కీపర్ల వద్దనుండి, పెద్ద ఆఫీసర్లవరకు కార్మికులపై లేనిపోని నిందలు వేస్తున్నారు. మీటింగుల్లో పాటలు పాడినందుకు, జిల్లాకార్మికమహాసభ వూరేగింపులో జెండా పట్టుకున్నందుకు, అధ్యక్షుని చర్యను అసహ్యించుకుంటున్నందుకు, ఇంతవరకు ముగ్గురు కార్మికులను పనినుండి తొలగించబడ్డారు. 5 గురు ఒక్కొక్క వారంరోజుల సస్పెండు చేయబడ్డారు.

వీరంతా జిల్లాకలెక్టరుగారివద్దకు వెళ్ళితమ కష్టాలను విన్నవించుకున్నారు. తాము అధ్యక్షుని తొలగించుటకు నోటీసు యిచ్చామని, సభ జరుపుకుంటామని - కలెక్టరుగారుకూడ హాజరుకావాలని కోరారు. కలెక్టరుగారు వారి కష్టాలను గురించి విచారించుతాను. కాని, మీటింగుకు హాజరుకాలేనని చెప్పారు.

కార్మికులు మెమోరాండం వ్రాసియిచ్చారు. ఈకంపెనీ యజమానులు జాతీయవాదులుగా నటించుతున్నారు. ఈ కంపెనీ ప్రాంతానికి గాంధీగారి పేరుపెట్టారు. అఖిల భారతకాంగ్రెసు నాయకులగు రాజేంద్రప్రసాద్‌గారు ప్రారంభోత్సవం చేశారు.

కార్మికులకు సరసమైన జీతాలు, కరువు భత్యాలు యివ్వకపోగా ట్రేడ్‌యూనియన్ హక్కులనుకూడ భంగపరుస్తున్నారు. నేతిబీరకాయలాగా వుంది వీరి జాతీయత.

కార్మికుల్లో అసంతృప్తి పెచ్చుపెరిగిపోతున్నది. యజమానుల చర్యలను కాంగ్రెసు వాదులు, ట్రేడ్‌యూనియనిస్టులు ఖండించాలి. కార్మికులకు సహాయపడి ఐక్య కార్మికోద్యమానికి దోహదం చెయ్యాలని కోరుతున్నాము.

లింగపాలెంలో

★

చింతలపూడి తాలూకా, లింగపాలెం గ్రామంలో కిరసనాయిలు కోటాదారుడు ప్రజలకు కిరసనాయిలు సరిగా పంచడంలేదు. బీదపాదలకు అసలే మొండిచేయి చూపిస్తున్నాడు. ఇచ్చేవారికి కోటాలో సగమయినా యివ్వటంలేదు. ఇతని అక్రమాల ఫలితంగా అనేకులు ఆముదపు దీపాలతోను, అదీ లభించని యిళ్ళలో కట్టెపుల్లల వెలుగుతోను కాలక్షేపంచేయవలసిన స్థితివచ్చింది. వెంటనే అధికారులు విచారణచేసి, ఇతనికి లైసెన్సు తొలగించి ప్రజలకు సరిగా పంచగల మరొకనికి లైసెన్సు యివ్వాలి.

ప్రజాశక్తి చందావివరాలు

★

సంవత్సర చందా	5—0—0
అర్ధసంవత్సర చందా	2—8—0
మూడునెలలచందా	1—4—0

(6 వ పేజీ తరువాయి) దానికి అధికోత్పత్తి యొక్క అవసరాన్ని గుర్తిస్తూ తీర్మానించింది.

రైల్వే కార్మికుల కరువుభత్యముపైన, బేసిక్ జీతాలపైన ఒకతీర్మానము, 1½ లక్షలు రైల్వే టెంపరరీ కార్మికులను తీసివేయరాదని వేరొక తీర్మానము ప్యాసైనది.

జీతాలు

వివిధపరిశ్రమల్లో కార్మికులకిచ్చే జీతాలు జీవితావసరాలకు సరిపోవుటలేదు. చాలని కరువుభత్యం మూలంగా కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు. బొంబాయి టెక్స్టయిల్ లేబరు ఎంక్వయిరీ కమిటీ సూచనలనుబట్టి కార్మికులకు జీవితమున కనుగుణ్యమగు జీతాలను నిర్ణయించాలని జనరల్‌కౌన్సిల్ తీర్మానించింది. బొగ్గు, ముడిపదార్థాల కొరత మూలంగా ఏర్పడే నిరుద్యోగమును ఎదుర్కొనడానికి కార్మికులకు పరిహారం యిచ్చుటకు ఆర్డినెన్సుతీసుకురావాలని కోరడమైంది.

కోలారు బంగారు గనుల కార్మికుల హక్కులపైనను, బొగ్గుగనులలో కార్మికుల హక్కులపైనను, బొగ్గుకొరతను గురించి, త్రైపార్టైయిట్ కమిటీలను గురించి, కార్మికులకు యిండ్ల సౌకర్యాలను గురించి, చేనేత పారిశ్రామికుల గురించి, కార్మికసంఘాలకు పత్రికలు నడుపుకొనేటందుకు అనుమతిని గురించి యితర తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి.

ఎ. ఐ. టి. యు. సి. యొక్క 25 వ మహాసభ రజతోత్సవము జరుపుటకు బొంబాయిరాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ఆహ్వానించింది. 1946 మేనెలలోగా దీనిని నిర్ణయించవచ్చు.

జపాను ఫాసిస్టులను ఓడించి, స్వతంత్ర బర్మాను నిర్మించుటకు కంకణము కట్టుకొని, భారత ప్రజల స్వాతంత్ర్యాన్ని కాంక్షిస్తున్న బర్మా స్వాతంత్ర్యవీరుల దగ్గరనుంచి, అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసుకు వచ్చిన సందేశము చివర చదివిన తర్వాత, జనరల్ కౌన్సిలు సమావేశం పూర్తి అయింది.

'ప్రజాశక్తి' నిధి

8-8-45 వ తేదీ పత్రికలో ప్రకటించిన మొత్తం వసూళ్లు 11,871 14 6

గుంటూరు జిల్లా

గుంటూరు తాలూకా

కారుమంచి వెంకటేశ్వర్రావు. కృష్ణాయపాలెం	16700	0	0
వెంకుద్దిలి శేషగిరమ్మ దొండపాడు	278	0	0
కూకట్ల సీతారావమ్మగారు. తుళ్ళూరు	5	0	0
జమ్ముల నాగేంద్రమ్మ ..	5	0	0
దొడ్డా నాగరత్నమ్మ ..	5	0	0
మందపాటి అన్నపూర్ణమ్మ ..	5	0	0
వువ్వాడ శేషగిరమ్మ ..	5	0	0
వువ్వాడ అనంతమ్మ ..	5	0	0
హైమావతి ..	5	0	0
నాగేంద్రమ్మ ..	5	0	0
మన్నవ శివరామక్రిష్ణయ్య చింతపల్లిపాడు	15	0	0
కొత్తమాసు వెంకయ్య దొండపాడు	10	0	0
అకుల కోటేశ్వరరావు. పెదవడ్లపూడి	50	0	0
అకుల బాలగంగాధరతిలక్ ..	50	0	0
చివుకుల శ్రీరామశాస్త్రి ..	40	0	0
యేళ్ళ శేషారావు ..	100	0	0
దొంతరాజు కృష్ణమూర్తి. నంబూరు	600	0	0
దొంతరాజు సీతారావమ్మ ..	100	0	0
కముకుర్తి వెంకటసుబ్బారావు పొన్నెకల్లు	10	0	0
గుమ్మడి వీరయ్య. చింతపల్లిపాడు	25	0	0
గోగినేని పెదనాగేశ్వర్రావు. తాడికొండ	200	0	0
ఏ. ఆర్. క్రిష్ణ కృష్ణాయపాలెం	200	0	0
కోటపాటి వెంకటేశ్వర్లు కొవ్వూలగర్త	5	0	0
విమ్మగడ్డవారి పాలెం ..	40	0	0
పెదకడ్లపూడి కామ్రేడ్లు	27	0	0
చిల్లరవసూళ్లు	9	0	0

తెనాలి తాలూకా

అడుసుమిల్లి సూర్యనారాయణ తెనాలి.	116	0	0
వెలివల వెంకట్రామయ్య కుచ్చెళ్ళపాడు	5	0	0

తూర్పుగోదావరి జిల్లా

[తూర్పుగోదావరిజిల్లా రామచంద్రపురం తాలూకా రు. 94-8-0 పది వసూలు చేసినట్లు క్రిందటివారం ప్రకటించాం. దాని వివరాలు క్రింద ఇస్తున్నాం. వీటిని యీవారం లెక్కలలో చేర్చలేదు. సం.]

చందన రాంకోటేశ్వర్రావు. దుళ్ళ	5	0	0
బిక్కవోలు రాజా ..	5	0	0
కురుపుగంటి వెంకటరత్నం ..	5		0
యన్నమని వెంకట్రాయుడు ..	10	0	0
బెళ్ల చిన మల్లికార్జునరావు ..	5	0	0
చింతా వీర్రాజు ..	10	0	0
దుళ్ళగ్రామం చిల్లరవసూళ్ళు	10	8	0
వైద్య అద్భుతరామయ్య. కపిలేశ్వరపురం	25	0	0
బుడుసు వెంకట్రాయుడు. పొతతిప్ప	10	0	0

(గుంటూరు తాలూకా — తరువాయి)

చక్కావల్లి మురహరి. కంచెర్లపాలెం	10	0	0
విద్యార్థి ..	5	0	0
యస్. వెంకట్రామయ్య. నందివెలుగు	10	0	0
కొత్తమాసు సత్యనారాయణ. తెనాలి	5	0	0
వ్యవసాయకూలీ సంఘం. కొల్లిపర	5	0	0
చిల్లరవసూళ్లు	11	0	0
ఒక సానుభూతిపరుడు. క్రొవ	116	0	0
పరుచూరి సాంబశివరావు. క్రొవ	116	0	0
కొత్తపల్లి వెంకట్రామయ్య అమృతలూరు	25	0	0
మంత్రవాది వెంకటశాస్త్రి. క్రొవ	10	0	0
.. సీతారామస్వామి ..	5	0	0
బాలసంఘం. ..	5	10	0
బరుగు సుందరరావు. అమృతలూరు	11	0	0
విరాటపు కోటయ్య. అమృతలూరు	500	0	0
వేములపల్లి కాళిదాసు ..	100	0	0
మ:దాల బుచ్చిరెడ్డి. జాగర్లమూడి	70	0	0
కొత్త హనుమంతరావు ..	50	0	0
గెల్లి వట్టాభిరామయ్య. అమృతలూరు	100	0	0
బొర్లి వెంకటేశ్వరరావు. అమృతలూరు	25	0	0
బాలసంఘం ..	6	3	0
వుడుం రామయ్య. తెనాలి	5	0	0
మునగాల వెంకటేశ్వర్లు. యడ్లపల్లి	10	0	0
కొత్తపల్లి వెంకట్రామయ్య. అమృతలూరు	25	0	0
ఒక సానుభూతిపరుడు ..	100	0	0
కొత్త రామకృష్ణయ్య. జాగర్లమూడి	100	0	0
కుర్రా సుబ్బయ్య. కొలిప	200	0	0
కుర్రా వెంకటేశ్వర్లు. క్రొవ	20	0	0
వేమ యాకోబు. దావులూరు	50	0	0
కటికి రాఘవయ్య. చదలవాడ	5	0	0
బొల్లిముంత రాఘవయ్య. చదలవాడ	5	0	0
కొత్తపల్లి నాగేశ్వరరావు. అమృతలూరు	10	0	0
అలపర్తి నరసింహారావు. యడ్లపల్లి	116	0	0
వేములమడ సత్యం ..	10	0	0
చదలవాడ కుప్పలు ..	25	0	0
పరుచూరు రఘురామయ్య ..	15	0	0
కాటగడ్డ కొనయ్య. చిలుమూరు	90	0	0
కందర్ల మంగపతిరావు ..	100	0	0
చిల్లరవసూళ్లు ..	10	0	0

రేపల్లె తాలూకా

వేజెండ్ల వెంకటవరసమ్మగారు పల్లెకోన	10	0	0
డి. పెద్దిరెడ్డి. పొన్నపల్లి	5	0	0
బట్టు రామకోటయ్య. భట్టిప్రోలు	5	0	0
కొల్లి రంగయ్య బొబ్బరలంక	15	0	0
ఏ. వి. భద్రయ్య. రేపల్లె	75	0	0
యం. యస్. మూర్తి. పొన్నపల్లి	10	0	0
డి. సుందరరెడ్డి. పొన్నపల్లి	10	0	0
మైనేని రంగయ్య. వల్లవారిపాలెం	5	0	0
వెలుగోటి-బలరామయ్య. రేపల్లె	200	0	0
బేతపూడి బుర్రకథ. బేతపూడి	50	0	0

కారుమంచి వెంకటేశ్వర్లు జాబు

కామ్రేడ్ సుందరయ్యగారూ !

ధనిక కుటుంబంలో పుట్టాను. సర్దాలకోసం. షోకులకోసం. ఆశలు – ఎటు గాలి వస్తేతే అటు గాలిపటంలా వరవళ్లుతొక్కే అరాజక వాతావరణం. కాని కమ్యూనిస్టు సిద్ధాంత ప్రభావం, నా చుట్టూవున్న పీడిత ప్రజాకోటిపై పుట్టు మరలించింది నన్ను. అస్పష్టమైనఆవేశం, వదునులేని పట్టుదలతో,నూతనసమాజం సృష్టించాలనే ఉబలాటం ఉబికింది. క్రమేపీ క్రియారంగంలోకి దించింది నన్ను. నన్నునేను అర్థంచేసుకున్నాను. అరాజకజీవితాన్ని పారదోలాను. వడిదుడుకులు దాటగలిగాను. నా "స్థానం ప్రజలలో" గాని ధనికకుటుంబంలో గాదనుకున్నాను. ప్రజాసేవయే పార్టీకి జీవం. పార్టీ జీవితమే నా జీవితం. నా సర్వస్వాన్ని పార్టీకి అంకితం చేశాను.

పార్టీపత్రిక 'ప్రజాశక్తి' - ప్రజలు తమ దైనందిన జీవిత సమస్యలను పరిష్కరించుకోవడానికి పడేఆవస్థలు, జరిగే తీవ్రపోరాటాలు కరతలామలకం చేస్తోంది. పోరాటశక్తి ప్రజల పత్రిక. ప్రజలశక్తి. ప్రజలకు ఊపిరి ప్రజాశక్తి. ప్రజాశక్తి దినపత్రిక కావడం ప్రజల విజయం. ప్రజాశక్తి విజయం కోసం; ప్రజావిజయం కొసం ఉవ్విళ్లూరుతూ నా శక్తికొలది పదిఎకరాల భూమిని యిస్తున్నాను

విప్లవాభివందనములతో.

కారుమంచి వెంకటేశ్వరావు

[10 యెకరాలు అమ్మినడబ్బు రు. 16700 లు చెల్లించారు. మరొక రు. 700 కోతలు పూర్తిఅయినపిదప పంపుతానన్నారు. ఈ 10 ఎకరాలమీద కౌలు తాలూకు రు. 2000 లు గత మే నెలలో పార్టీఫండుగా కామ్రేడ్ కారుమంచి ఇచ్చారు. సం.]

పల్నాడు తాలూకా

బరం గురవారెడ్డి. మాచినపాడు	20	0	0
ఆక్కులేరు. పిల్లొట్ల	10	0	0
వెన్నా సుబ్బారెడ్డి. మాచినపాడు	6	0	0
యడ్లపల్లి పకీరయ్య ..	5	0	0

గుంటూరు టవున్

కోనూరు కోటయ్య ముఠా లాగుడుబండ్ల కార్మికసంఘం	28	0	0
బోయపాటి వీరయ్యముఠా ..	50	0	0
షేక్. ఖాసిం ముఠా ..	31	0	0
అల్లరమణారెడ్డిముఠా ..	15	0	0
గాజా నారాయణముఠా ..	20	0	0
బీరం సుబ్బయ్యముఠా ..	30	0	0
మానం చంద్రయ్యముఠా ..	8	0	0
కొమ్మారెడ్డి వెంకటరెడ్డి అడ్వొకేటు	100	0	0
యం. ఇన్నయ్య	50	0	0
ఆచారి	50	0	0
కొరిటెపాడు; నాజరు బుర్రకథ	51	6	0
వలరాజు; స్టూడెంటు	5	0	0
శ్రీరంగం ".	20	0	0
వేల్పూరి సుబ్రహ్మణ్యం	50	0	0
జి. మాధవరావు	10	0	0
గోపాలం (కాఫీపనివారల సంఘం)	5	0	0
గోల్డెన్ లీఫ్ టొబాకో కంపెనీ	50	0	0
చిల్లర వసూళ్లు.	3	2	0

బాపట్ల తాలూకా

అమరనేని భావయ్య. వర్పాయపాలెం	50	0	0
పాములపాటి సుబ్బారావు గోళ్ళమూడిపాడు	250	0	0
పార్వతీశం. పాలపర్రు	100	0	0

ఒంగోలు తాలూకా

కొండపి. నాజరు బుర్రకథ	116	0	0
చిల్లర వసూళ్ళు	11	11	0

నర్సరావుపేట తాలూకా

నల్లపాటి అంజనేయులు కొవ్వూలగర్త	100	0	0
పావులూరి నాజర్, వేలూరు	10	0	0
గింజపల్లి వీరయ్య. ..	40	0	0
పతాంజి. నర్సరావుపేట	5	0	0
షేక్ ఇబ్రహీం షరీఫ్ ..	5	0	0

సత్తెనపల్లి తాలూకా

సత్తెనపల్లి టవున్ వసూలు	461	0	0
డాక్టరు సీతారామశాస్త్రి సత్తెనపల్లి	1000	0	0
దర్శి లక్ష్మయ్య. పెదకూరపాడు	116	0	0
ఎమిరెడ్డి రామిరెడ్డి. సిరంగిపురం	200	0	0

పశ్చిమ గోదావరి జిల్లా

మంతపల్లి రాజగోపాలరావు కాగుపాడు	500	0	0
పాలకొల్లు చిల్లర వసూళ్ళు	4	0	0
బైనపాలెపు సదాశివుడు	5	0	0
శిష్ట్లా వెంకట్రామయ్య	15	0	0
గొడవర్తి నాగేశ్వరరావు	10	0	0

కడప జిల్లా

శ్రీ మేడా సిద్దారెడ్డి	5	0	0
రాజంపేట వైజ్ఞానికదళం	5	0	0
మొత్తం	36.584	14	6

కొత్తకాలువ కోర్కె నెరవేరింది

ఆత్మకూరు తాలూకాలో (నెల్లూరుజిల్లా) పెళ్లూరుకాలువ యిప్పటికి 27 సంవత్సరాల నాడు తవ్వబడింది. పొడవు 2మైళ్ళు. దాదాపు 2900 యకరాల మెట్టభూమి యీకాలువ రావడంతో మాగాణి భూమిగా మారింది. 8 గ్రామాలకు యిది నీటిపారుదల యిస్తుంది. కాని కాలువ త్రవ్వకం సరిగా జరుగక, దాని కానుకొనివున్న పెన్నానది యిసుక దిబ్బలవల్ల నీరు సక్రమంగా పారుటలేదు. ప్రతి సంవత్సరం దాదాపు 8 వేల రూపాయలు ఖర్చుపెట్టి మరమ్మతు చేయవలసి వచ్చేది. కాని, మరికొంత కాలమయాక కాలువకు చుట్టూ కూడ యిసుకదిబ్బలు లేచాయి. 4 సంవత్సరాలుగా యీదిబ్బలు మరీయెత్తు అయాయి. పోయిన సంవత్సరం కాలువే పూర్తిగా పూడిపోయింది. అందువల్ల పంటలు ఏమాత్రమూ పండలేదు. 8 లక్షల రూపాయల విలువగలధాన్యం పండకుండాపోయింది. 2000 యకరాల భూమి బీడు అయిపోయేస్థితి కలిగింది. మరో కాలువ తవ్వితే బాగుందని రైతులు ఉత్సాహపడుతూ వచ్చారుగాని, ఒకరిద్దరు భూస్వాములు ఆటంకపరచారు మిగతావారు భూస్వాముల చెప్పుచేతల్లోఉండడంవల్ల, స్వతంత్రించి పనికి పూనుకోలేదు.

ఈ పరిస్థితిలో తాలూకా రైతుసంఘం, కమ్యూనిస్టుపార్టీవారు కలసి, కొత్త కాలువను తవ్వుకోవాలని, యీలోగా తాత్కాలికంగా భూములు బీళ్ళు కాకుండా చూడ్డానికి ఒక యేర్పాటుచేయాలని, ఆ యా గ్రామాల్లో ప్రచారంచేశారు. జూన్ 22వ తేదీని పుల్లనీళ్ళపల్లెలో అన్ని గ్రామాల ప్రతినిధుల్ని సమావేశపరిచారు. కామ్రేడ్ జి వి. కొండయ్య అధ్యక్షత వహించారు. 2 రోజులు వాదోపవాదాలు జరిగాయి. చివరకు కొత్తకాలువే త్రవ్వాలని, ఎకరాల దామాషాచుట్టి అందరి దగ్గర పైకం వసూలుచేసి స్వయంగానే పని పూర్తిచేయాలని, తీర్మానించబడింది. ఈకార్య నిర్వహణకు ఒకసబ్ కమిటీనిఎన్నుకున్నారు.

కాలువ లెవెల్సు తీయించడం, ఎస్టిమేషన్ వేయడం - కూడా పూర్తి అయింది.

రైతులందరిలో సంతోషం ఉప్పొంగింది. ఇన్నాళ్ళకు తమ కోర్కె ఫలించబోతోంది కదా ! అని ఉత్సాహపడ్డారు.

కాని ఇంతలో ఒకరిద్దరు భూస్వాములు పేచీలేవదీశారు. పని ఎన్నటికీ పూర్తికాదని ప్రచారం ప్రారంభించారు. ప్రజలే స్వయంగా పెత్తనంవహించి, కాలువను త్రవ్వితే వీరల్ని ధిక్కరించి తమ భూములకు ముందే నీరు పెట్టుకోవడం యిక ఉండదని వీరి భయం ! అంతేగాక, మరో రెండు సంవత్సరాలుంటే, వీర రైతులు దివాలాతీసి, తమకు భూములన్నీ తాకట్టు పెట్టి బ్రతకవలసివస్తుందని వీరి ఆశ. అందుకనే భూస్వాములవద్దకు రైతుల రాయబారవర్గం వెళ్ళినప్పుడు ఈ యిద్దరూ తలాయించారు. దామాషా ప్రకారం సొమ్ముచెల్లించ నిరాకరించారు. "ఎప్పుడో మావారు కాలువ తవ్వించినప్పుడు రైతులు రు. 1600 ఇవ్వవలసియుందని, వడ్డీతోసహా దాన్ని చెల్లిస్తేనే యివ్వడు దామాషాసొమ్ము యిస్తా"మని, పట్టుపట్టారు. ఒక్క దమ్మిడీ కూడా రైతులు యివ్వవసరంలేదని ఇచ్చితంగాను, సహేతుకంగాను తెలియచేశారు. భూస్వాములుమాత్రం పట్టుదల వదలలేదు.

దీనితో ప్రతిష్టంభన ప్రారంభమయింది. ఒక నెల గడిచింది. ఇక యిప్పుడు కొత్త కాలువపనికి పూనుకున్నప్పటికీ, సకాలంలో నీరు రాదు. పాతకాల్వనే ప్రస్తుతం బాగు చేసి, వచ్చే సంవత్సరమైనా కొత్త కాలువ త్రవ్వకుందామని రైతులకు నచ్చచెప్పబోతే రైతులు రామన్నారు. పోనీ యింతకుముందు త్రవ్వి వదలివేసిన "బాబూనాయు" కాల్వను త్రవ్వించవచ్చు. దానికి కనీసం 8 వేలరూపాయలు కావాలికానిదీనికైనా వ్యవధి తక్కువ. కాలువ అడుగున చట్టుఉందని కొందరి వాదన. అయితే. భూములన్నీ బీడుకావలసిందేనా ! అని అందరిలోనూ పట్టుదల ప్రారంభమైంది. తిరిగి రైతుసమావేశాలు, వాదప్రతివాదాలు.

చివరకు జులై 18న కామ్రేడ్ కొండయ్య అధ్యక్షతక్రిందతిరిగిరైతుల సమావేశంప్రారంభమైంది. మూడురోజులు వరుసగా జరిగింది. ఆసమావేశంలో ఆమోదింపబడిన తీర్మానం : రెండు సంవత్సరాలకైనా నీటి పారుదలనిచ్చే "బాబూనాయుకాలువ" ను తవ్వాలి: అందుకవసరమైన రు. 8000 రైతుల్లో వసూలు చేయాలి. అన్ని గ్రామాల ప్రతినిధులు - 50 మంది - ఒక అగ్రిమెంటు వ్రాసుకొని దాన్ని కామ్రేడ్ కొండయ్యవద్ద ఉంచాలని, తగాదాలువస్తే కొండయ్యదే అంతిమ నిర్ణయంగా ఉండాలనీ, ఒప్పుకున్నారు.

డబ్బువసూళ్ళు వెంటనే ప్రారంభమయాయి 23-7-45 నుండి ప్రతిరోజూ 500 మంది కూలీలు పనిచేస్తున్నారు. ఇప్పటికి సగానికి పైగా కాలువతెగింది. బాగా పని చేసిన కూలికి రోజు 1 కి రు 2-0-0 వరకు వస్తోంది. నార్లుపోసే అదునుకూడా సమీపిస్తోంది. నాట్లకు త్వరగానీరుతెచ్చుకోవాలనే తొందర, పట్టుదల అందరిలోనుకనిపిస్తోంది.

ఎర్రజెండా నీడను రైతుల రా ఏకమైతే చేయలేని పని అంటూ ఉండదు.

బోడిపాలెం రైతుల చొరవ

గరికిపాటివద్ద(కృష్ణా)బయల్దేరు స్టీర్ ఛానల్ వండూరువరకు నీటి పారుదల కలిగిస్తుంది. దీనికి గవర్నమెంటు 10 సంవత్సరాలుగా మరమ్మతు చేయించడంలేదు. వచ్చేనీరు అకుమళ్ళకే సరిగా సరిపోదు. బోడిపాలెం రైతులు దీన్ని గుర్తించి, కాలువను మరమ్మతు చేయుటకు పూనుకున్నారు. 2, 3 గజముల వెడల్పుతో 3 మైళ్ళ పొడవున కాలువ తవ్వించారు. ఇందువల్ల 650 యకరాల భూమిలో య1కి 3 బస్తాల ధాన్యం అదనంగా పండుతుంది. యీ సంవత్సరం 15 రోజులు ముందుగాసాగు అయింది. దీనికిగాను రు. 1000ఖర్చయింది. గవర్నమెంటు రు. 150 మాత్రం యిచ్చింది. మిగతాది యకరం 1కి రు. 1-8-0 చొప్పున రైతులే భరించుకున్నారు. మురుగు వనరులు లేనందున పై స్టీర్ ఛానల్ తూమును ప్రభుత్వోద్యోగులు మూయగట్టారు. సదరు కాలువ క్రింద యిటీవల 300 యకరాల భూమిని అధికోత్పత్తికై యివ్వడం మూలాన కాలువకు నీరు సరిపోవడం లేదు. అందువల్ల యీ తూముకు వెడల్పు చేయించి, 1 మైలుదూరంవద్దనుండి కాల్వను యిరుప్రక్కల 1 గజం వెడల్పు చేయించవలసినదని, తూములవద్ద యిరుప్రక్కల రాతికట్టడము కట్టించవలసిందని, వి. హెచ్. సుబ్బారావు గారు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.

ఇలాగే, వండూరు వద్దయి ఛానల్ క్రింది బ్రాంచి కాలువ బోడిపాలెంలో 300 యకరాలకు నీటిని సప్లయి చేస్తూంది. ప్రభుత్వం సుమారు 10 సంవత్సరాలుగా మరమ్మతు చేయించనందున రైతులే చొరవచేసి, యకరం 1కి రు. 1 చొప్పున వేసుకొని 1½ మైలు కాలువను మరమ్మతు చేయించుకున్నారు. దీనివల్ల కూడా యకరం 1కి 3 బస్తాల చొప్పున అదనపుపంట పండుతుంది. దీనికైన ఖర్చు రు. 300 లలో ప్రభుత్వం రు. 160 యిచ్చింది. తూములవద్ద కట్టడాలు కాలువ పూడకుండా ఉండుటకు అచ్చట యిరువైపుల రాతి కట్టడము కట్టించవలెనని సుబ్బారావుగారు సూచిస్తున్నారు.

యాదవులలో నూతన సంఘ చైతన్యం

మనదేశంలో అన్ని కులాలవారు, అన్నిజాతులవారు సమానస్థాయిలో అభివృద్ధి పొందడంలేదు. అర్థికంగాను, సామాజికంగాను ఎంతో వెనుకబడ్డవారున్నారు. అయితే ఇతర కులాలలోను, జాతులలోను కలిగే అభివృద్ధిని వారు ప్రత్యక్షంగా చూస్తున్నారు. తాముకూడా విద్య, విజ్ఞానం, సంపద-సంపాదించి వారితో సమానంగా పైకి రావాలనే ఆకాంక్ష బయల్దేరుతోంది. ఇది వివిధ దశలలో వివిధ రూపాలు పొందింది; పొందుతోంది. రాజకీయంగాను, అర్థికంగాను, వైజ్ఞానికంగాను. ఎక్కువ అభివృద్ధిపొందిన జాతులకు యీ కొత్తచైతన్యం వింతగానే కనపడవచ్చు; నేడుకూడా కులసంస్థలు బయల్దేరుతున్నాయేమిటి? అని ఆశ్చర్యం కలుగవచ్చు. కాని వారి పరిస్థితుల్ని జాగ్రత్తగా పరిశీలిస్తే, ఇలాంటి అనుమానాలు రావు.

ఉదాహరణకు, ఆంధ్రరాష్ట్రంలో అన్ని జిల్లాలలోను యాదవ కులానికి చెందినగొల్లలు అనేకులున్నారు. వారు సంఘాలు పెట్టుకొని, దురాచారాలు పోగొట్టుకొంటూ, యితర కులాలవలె పైకిరావాలనిఉవ్విళ్ళూరుతున్నారు. అనంతపురంజిల్లాలో కర్నగొల్లలు, పూజగొల్లలు, పాకనాటిగొల్లలు, పెద్దేటిగొల్లలు, అడవి గొల్లలు-అని చాలా శాఖలున్నాయి. రాయలసీమ జిల్లాలలో గొల్లలు నాలుగు "కట్టలలో" నివసిస్తున్నారు. దొనకొండకట్ట (నెల్లూరుజిల్లా) రేమళ్ళకోటకట్ట (కర్నూలుజిల్లా), గొల్లహోసూరు (కర్నూలుజిల్లా) దేవదుల కొండకట్ట (అనంతపురంజిల్లా) వీరంతా కాటమరాజు సంతతికి చెందిన వారని ప్రతీతి. వీరి స్త్రీలు రవికెలు తొడుక్కో కూడదని, రు. 14 కంటె ఎక్కువ "వోలి" తీసుకోరాదని, చాలా కాలంనుంచి నిబంధనఉంది. వీటికి భిన్నంగా ప్రవర్తిస్తే సంఘంలోనుంచి బహిష్కరిస్తున్నారు. పూర్వం ఏకారణాల వల్లనో ఏర్పడ్డ యీ కట్టుబాట్లు ప్రస్తుత నాగరిక ప్రపంచానికి, సమాజాభివృద్ధికి, ఆటంకంగా ఉన్నందువల చైతన్యవంతులైన యువకులు కొందరు వాటిని నిర్మూలించడానికి నడుం కట్టారు. దేవాదులకొండకట్ట, గొల్లహోసూరుకట్ట, లకు చెందిన కొత్తకోట, జోహరాపురం యువకులు 20 గ్రామాలలో ప్రచారంచేసి, క్రిందటినెల 23వ తేదీని దేవాదులకొండలో ఒకసమావేశం ఏర్పాటుచేశారు. వివిధ గ్రామాలనుంచి 100 మంది ప్రతినిధులు హాజరయారు. శ్రీముదుగల్లు గోవింద రెడ్డిగారు ప్రతినిధుల్ని, ప్రేక్షకుల్ని, ఆహ్వానిస్తూ యాదవకులస్థులంతా యితర కులాలమాదిరిగానే పాత దురలవాట్లను మానివేయాలని హెచ్చరించారు. కామ్రేడ్ పురిమెట్ల వెంకటనామప్ప ఉపన్యసిస్తూ, యాదవులందరూ యీ ప్రాంతంలో పేదరైతులే గనుక, తమ కులాన్ని అభివృద్ధిచేసుకోవడంతోబాటు రైతుసంఘాలలో విరివిగాచేరి, భూస్వాముల, జమీందార్ల, దోపిడీని ఎదుర్కొమని విజ్ఞప్తిచేశారు. కామ్రేడ్ దాదా సోవియట్ రష్యాలో తమకంటెకూడా వెనుకబడ్డ మధ్య ఆసియా ప్రజల్ని అక్కడి ప్రభుత్వము ఎంత వేగంగా అభివృద్ధి పరచిందో వివరించారు. మహాసభ అధ్యక్షత వహించిన రెడ్డి పాపన్నగారు పూర్వపు ఆచారాలు నేడు యెలా అభివృద్ధికి ఆటంకంగా ఉన్నాయో విరూపిస్తూ ఉపన్యసించారు. తరవాత తీర్మానాలు, ఎన్నికలు, జరిగాయి. స్త్రీలు రవికలు తొడుక్కోరాదనే నిబంధనను అన్ని కట్టలవారు తొలగించుకోవాలని, "వోలి" పద్ధతిని పూర్తిగా రూపు మాపాలని, రైతుసంఘాలలోచేరి తమ హక్కులకై పోరాడాలని. సంఘనిధికి ప్రతివివాహసమయంలోను రు. 2 చొప్పున యివ్వాలని, తీర్మానించబడింది. సంఘాధ్యక్షుడుగా రెడ్డిపాపన్నగారు, కార్యదర్శిగా ముదుగల్లుగోవిందరెడ్డిగారు ఎన్నుకోబడ్డారు.

★

ఇలాగే బందరులో 23-7-45వ తేదీని కృష్ణాజిల్లా యాదవ యువజనసంఘంయొక్క రెండవ వార్షికోత్సవం మద్రాసు కార్పొరేషన్ మేయరు రాధాకృష్ణ పిళ్లెగారి అధ్యక్షతక్రింద జయప్రదంగా జరిగింది. 16 గ్రామాలనుంచి ప్రతినిధులు వచ్చారు. అధ్యక్షులు మాట్లాడుతూ, అన్నింటికంటె విద్య చాల అవసరమని, బందరులో ఒక యాదవ హాస్టల్ నిర్మించడం అవసరమని చెప్పారు. బందరు వాటర్‌వర్క్సుదగ్గర పశువులకు ప్రత్యేకంగా ఒక "కాటిల్‌యార్డ్" కట్టించవలెనని, గొల్లవీధిని "యాదవ పురం"గా మార్చవలెనని, బందరు మ్యునిసిపాలిటీని కోరుతూ తీర్మానాలు చేయబడ్డాయి. ఏ. గంగయ్యగారు, కుందేటి సుబ్బారావుగారు యాదవ కులంయొక్క ఔన్నత్యాన్ని ప్రశంసిస్తూ ఉపన్యసించారు. బాల్యవివాహాలను ప్రోత్సహించరాదని, వితంతు వివాహములకు ప్రోత్సాహమియ్యాలని హెచ్చరించారు. "రాజులు", "గురువులు" యేటేటా వచ్చి మామూళ్ళు తీసుకువెళ్ళే ఆచారాన్ని నిర్మూలించాలన్నారు. త్రాగుడు కూడా పోవాలన్నారు. ప్రభుత్వం యాదవులకు ఉచిత విద్యాసౌకర్యం, స్కాలర్‌షిప్పులు యిచ్చి, ఉద్యోగాలలో కమ్యూనల్ జి.ఓ.ను వీరికికూడావర్తింపజేయాలనికోరారు.

ఒక్క బుకాయింపును సర్దుకోడానికి అనేక అబద్ధాలు!

—///—

(8 వ పేజీ తరువాయి)

అబద్ధమాడటానికి యీ పెద్దమనిషికి ఏమైనా వెరపువుం దేమో చూడండి! అత నికంటె ఘనుడు అచంటమల్లన్న అన్నట్లుగా వుంది గాదూ!

రంగా యిలా ఎందుకు ప్రపంచం కళ్ళు గప్పడానికి ప్రయత్నించుతున్నాడు? తాను చేసిన తప్పులను కప్పిపుచ్చు కోడానికి! విద్యార్థి కాంగ్రెసు సమావేశంలో ఆగస్టు ఉద్యమాభిమానులు వున్నారు. వాళ్ళచేత పొగడ్తలు సంపాదించాలి! లేనిచో మోస పడిన శిష్యులు కండ్లు తెరుస్తారని భయం! ఏ యెండకాగొడుగు పట్టడం అవకాశవాదుల మార్గమేగదా! అందుకని వర్కింగ్ కమిటీ హర్షించిందని అనేశాడు. చప్పట్లువచ్చాయి. రేపుపొద్దున ఎవరైనా పొగదీస్తారనుకోండి! "అట్లే నేనలా అనలేదు. పత్రికలు తప్పు రిపోర్టు చేశాయి" అని తప్పుకుంటాడు దొడ్డి త్రోవను.

పట్టాభి మెరుగా?

వడ్లమూడి సత్యనారాయణగారు తమ లేఖలో యింకోవిషయం లేవదీశారు. "మిగతా ఆంధ్ర కాంగ్రెసు పెద్దలవలె పట్టాభి బయ టికి వస్తూనే విచక్షలేకుండా కమ్యూనిస్టులను నీచంగా దూషించలేదు. వెంగమ్మనాటకా లాడించమని ప్రోత్సహించలేదు. ఆంధ్ర స్త్రీల శీలాన్ని శంకిస్తూ గుజరాతీయులకు మొరపెట్టుకోలేదు". కాబట్టి పట్టాభిగారు కమ్యూనిస్టులను దుయ్యబట్టించడానికి అలా అన్నారనడం సబబుకాదేమోనని సందేహం వెల్లడించారు.వడ్లమూడి సత్యనారాయణగారు.

ఈ సందర్భంలో సత్యనారాయణగారు ఒక సత్యాన్ని గమనించాలి. బెజవాడ సభలో కాంగ్రెసు పెద్దలు వని విభజన చేసుకున్నారు. పట్టాభిగారు ఆగస్టు ఉద్యమం కాంగ్రెసుదే నన్నారు. శిష్యులమంది చప్పట్లు తెచ్చుకు న్నారు. ఆగస్టు ఉద్యమంలో చేరని కమ్యూ నిస్టులు దేశద్రోహులని కాశేశ్వరరావు దబ్బా వాయించారు. వీరి మోసంలోపడినవారిమంచి మళ్ళీ చప్పట్లు వచ్చాయి. అచ్చా! ఇంకేమి కావాలి? కమ్యూనిస్టులపై నిందలు! తమకు హర్షధ్వనులు వచ్చాయి. ఈ విషయం గమ నించితే వడ్లమూడి సత్యనారాయణగారికి నిజం బోధపడుతుంది!

ఇంతేకాదు. 22 వ తేదీ బందరు ఉపన్యా సంలో పట్టాభి ఏమన్నాడో చూడండి! 'రష్యా నీరికి ఫాదర్' అంటూ చౌకరకపు నిందలకు దిగాడు. "ఇదివరకు మీరువస్తాను యివ్వబట్టే కమ్యూనిస్టులు విజృంభించి రు. రేపటినుండీ వారి ఆటలు సాగవు. స్వాతం త్ర్య సంపాదనలో బ్రిటిషువారిమీద మాత్రం మనం అహింసావలంబకులం. మనలోమనకు కలహాలువస్తే హింస వుపయోగించాలి. దెబ్బకుదెబ్బ కొట్టాలి. అందువల్లనే ప్రతి వాలంటీరు కూడ మీటింగుకు వచ్చేటప్పుడు లాఠీ తెమ్మని నేను ప్రతివారికీ చెబుతున్నా" అని బహిరంగ సభలో పుత్రిడడిగిన ప్రశ్నకు సమాధానంగా తండ్రి పట్టాభిగారు చెప్పారు.

పై మాటలు బందరు సభకు హాజరైన మా విలేఖరి డైరీనుంచి గ్రహించాము. సభకు హాజరయినవారంతా పట్టాభిగారు పైమాటలు చెప్పారని అంగీకరించుతారు. ఇది కమ్యూ నిస్టు వ్యతిరేకతకాదా? వీరి అహింస లోతు చూడండి! బ్రిటిషు సామ్రాజ్యవాదులపైనే అహింసట! కమ్యూనిస్టులను పట్టాభి నిందించు టేకాదు. శిష్యులను లాఠీలు తెమ్మనీ, 'హింస వుపయోగించాలనీ' ప్రబో ధం చేస్తున్నాడు. వడ్లమూడి సత్యనారాయణ గారు పై విషయం కమ్యూనిస్టు వ్యతిరేకతనే తెలుపుతూందనే సత్యాన్ని గ్రహించుతారని ఆశించుతాను. పట్టాభిగారికి బహిరంగలేఖలో (1-8-45) వ్రాసిన విమర్శన సరియైనదని పైమిత్రులకు బోధపడుతుందని ఆశించుతాను.

వడ్లమూడివారి లేఖలో "భులాభాయి - లియాఖత్ ఒడంబడికను నే నాశీర్వదించానని గాంధీజీ అంటే, భూలాభాయి స్వార్థంతో కాంగ్రెసును ద్రోహం చేశాడని ప్రకాశం అన్నాడు. ఎవరు సరి?" అని ప్రశ్నించు తున్నారు.

ఒక్క ప్రకాశంగారే కాదు. ఈ విష యంలో పట్టాభిగారుకూడ బందరు ఉపన్యా సంలో ఇలాఅన్నారు: "కాంగ్రెసు వర్కింగు కమిటీకి తెలియకుండానే కేంద్ర ప్రభుత్వ నిర్మాణానికి ఉభయులూ ఏర్పాటు చేసికోవడం ఆశ్చర్యకరమైన విషయమే. కాంగ్రెసును అప్రధానంగా ప్రక్కకు త్రోసివేయడంలో బ్రిటిషువారు అనుసరిస్తూవచ్చిన విధానానికి ఈ పద్ధతి సహాయభూతమయ్యేది. కాని ధైర్యంచేసి దానికి భిన్నమైన నిర్ణయాన్ని చేయడం లార్డువేవెలును చిరస్మరణీయుణ్ని చేసింది." (26-7-45 ఆంధ్రపత్రిక)

'పట్టాభి రేపు అనలేదంటారు!'

ఈ విషయమై పత్రికా విలేఖరులు అడి గినప్రశ్నలకు గాంధీజీ సమాధానంగా ఇలా చెప్పారు: "ఈప్రశ్న మీరుఅడగవలసినవారిని అడగడంలేదు. ఆ ఒడంబడికను చేసుకొన్న వారే ఇందుకు సమాధానం చెప్పడానికి సమ ర్థులు డాక్టరు పట్టాభి ఏదోఅన్నాడంటున్నారు. తాను అనలేదని వారు రేపుచెప్పవచ్చు.... ....

"కాంగ్రెసును దాటుగా వెన్నులో పొడవా లనిగాని, దాన్ని త్రోసిరాజనాలనిగాని భూలా భాయిగారు ఈషణ్మాత్రమైనా ఉద్దేశించలేదు. రాజకీయరంగంలో భూలాభాయిగారు కూడా కాంగ్రెసువల్లనే పైకివచ్చారు కాబట్టి ఇలాంటి దురుద్దేశాన్ని ఆయన ఎన్నడూ పెట్టుకొని వుండరు. వారు ఏదైనా కుతంత్రం పన్ను చున్నారని తెలిసి వారితో నేను కలిసినట్ల యితే, నేను ఆత్మహత్య చేసికోవడమే అవు తుంది. గౌరవప్రదంగా భారతదేశ రాజకీయ ప్రతిష్టంభనను పరిష్కరించాలన్నదిమాత్రమే భూలాభాయి దేశాయిగారి ఉద్దేశం. తద్వారా దేశాయిగారు కాంగ్రెసుకు సహాయపడాలనే ఉద్దేశించారు." (30-7-45 ఆంధ్రపత్రిక)

గాంధీజీ యింత స్పష్టంగా చెప్పాక నేను వ్యాఖ్యానంచేయడం అనవసరం. అయితే, ఆంధ్ర కాంగ్రెసు పెద్దలైన ప్రకాశం - పట్టాభి గార్లు దేశాయిని ఆక్షేపించారు. ఎందుకు? దీనికి ఒకటే రహస్యంవుంది. కమ్యూనిస్టుల వలెనే దేశాయికూడ ఆగస్టు ఉద్యమంలో చేరలేదు. అందుచేత ప్రకాశం - పట్టాభిగార్ల దృష్టిలో 'భూలాభాయి ద్రోహంచేశాడు' అందుకని సందర్భం వున్నా, లేకపోయినా ఆయనను దూషించాలి. దేశాయి - లియా ఖత్ ఒడంబడికసాకుగాచూపి దూషించదలచు కున్నారు: దూషించారు. వేవెలు తమ్ము మనిపూని మారేడుకాయ చేశాడని గుర్తించ లేకపోయారు. వేవెలును పొగిడారు. ఫలి తంగా తామే వెల్లకిలబడ్డారు.

ఏలూరుసభలో బుకాయింపు

ఇంత జరిగాకకూడ ప్రకాశంపంతులుగారు తమ బుకాయింపు మానుకోలేదు. ఆగస్టు 8వ తేదీన ఏలూరులోబహిరంగసభ జరిగింది. దానిలో ప్రకాశంగారిలా అన్నారు."మేమంతా తిరిగివచ్చి మీతో మాట్లాడుతామని అనుకో లేదు. మామీదపెట్టిన కేసులుచూస్తే జర్మనీ, రష్యావారైతే వదలిపెట్టేవారేకారు. ఇంగ్లీషు వారు కాబట్టి ఇంతాయినా, ఇప్పటికయినా వదలిపెట్టారు. జైలుబయటవున్న కొందరికి ఉత్సాహం కలిగించి, ప్రభుత్వస్థాపన చేయ వలసినదని కోరినా ప్రభుత్వం మాత్రమంగీక రించలేదు." (11-8-45 ఆంధ్రపత్రిక)

ఈ మాటలలోని బుకాయింపు స్పష్టం. ప్రకాశంగారికి నాజీజర్మనీ, ప్రజారాజ్యమైన రష్యా ఒకటిగానే కన్పించుతూంది. మనలను బానిసలుగా వుంచిన బ్రిటిషుసామ్రాజ్యవాదులే మెరుగుగా కన్పించుచున్నారు. ప్రకాశం పంతులుగారూ! తిరిగి ఒకసారి ఆలోచిం చండి! మీమాటలు మీకే అసహ్యంగా కన్పించుతాయి!

ప్రకాశం పంతులుగారు ఏలూరు సభలో యింకో ఘనకార్యం చేశారు. కమ్యూనిస్టుల చర్యలను విచారించి రిపోర్టు చేయడానికి ఒక సంఘాన్ని నియమించారు. దానిలో మాగంటి బాపినీడు, పేరూరు పేర్రాజు, మల్లంపల్లి చంద్రశేఖరములను సభ్యులుగా సూచించారు. ఆఖరివారు ఉపసంహరించుకొనగా, వారణాశి పద్మనాభంగారిని చేర్చారు. పైవారు కాంగ్రెస్ పక్షానికిచెందినవారినీ, నిష్పక్షపాతులే కమి టీలో ఉండాలనీ కొందరు లాయర్లు, ప్రజలు ఆక్షేపణ తెలిపారు. కాని ప్రకాశంగారు ఆకమిటీనే వుంచారు.

దొంగవ్యాపారులను విచారించడానికికూడ ఒక కమిటీని వేయాలని ప్రజలు డిమాండు చేశారు. కాని ప్రకాశంగారు ఏవో కబుర్లు చెప్పి తప్పుకున్నారు. దొంగవ్యాపారులను విచారించడానికి కమిటీని వేయలేదు.

విచిత్రం చూడండి! ప్రకాశంగారి సభకు అధ్యక్షుడు దొంగవ్యాపారంలో భాగస్వామి అయిన వీరమాచనేని వెంకటనారాయణగారు. దొంగవ్యాపారుల విచారణ అంటే యీ పెద్ద మనిషి గుట్టు బయటపడుతుంది. అందుచే ఆయన్ను రక్షించడానికి ప్రకాశంగారు ప్రజల డిమాండు త్రోసివేశారా?

ఏలూరు దెబ్బలాటను గురించి చెబుతూ, ప్రకాశంగారు యిలా అన్నారు: "కమ్యూ నిస్టు మిత్రులకు ఒక్కటే సలహా చెబుతు న్నాను. 'మీ హద్దు మీరకండి' అంటు న్నాను. ఈ విధంగా తలకాయలు బద్దలవ డం, బరిశెలతో పోట్లు యెందుకు జరుగుతు న్నవో అర్థమవటంలేదు. ఈవిధమైనకృత్యాలు జరుగుతూంటే ఈ మేజిస్ట్రేట్లు పోలీసులు ఏమైపోయారు?" (18-8-45 ఆంధ్ర పత్రిక)

దొంగ వ్యాపారుల మాట విని ప్రకాశం గారు కమ్యూనిస్టులను హెచ్చరించడం మొదటి తప్పు. పోలీసులకు పై విధంగా అప్పీలుచేయడం రెండోతప్పు. ఈవిషయంలో తమ శిష్యులు వెనకబడలేదని ప్రకాశం పం తులుగారు తెలసికుంటే మంచిది. వీరమాచ నేని వెంకటనారాయణ, బాపినీడుగార్లు పోలీసు ఆఫీసులచుట్టూ తిరిగారు. మొత్తం 86 మంది ప్రజాసేవకులను అరెస్టు చేయించారు. నెల రోజులు పైన అయినా కేసు విచారణలేదు. జామీను యివ్వలేదు. ఈవిధంగా పోలీసు ప్రాపకం సంపాదించి ఏలూరు ప్రజలచే చివాట్లు తింటున్నారు. ఇట్టి బాపినీడులాంటి వారిని విచారణ సంఘంలో వేయడం హాస్యాస్పదం కాదూ! ఇది ప్రకాశంగారు ఆలో చించి చేసిన పనేనా?

బాపినీడు, పేర్రాజుగార్లు కమ్యూనిస్టు వ్యతిరేలనికు ప్రజలందరికి తెలిసినవిషయమే. అలాంటప్పుడు ప్రకాశంగారు వీరిని కమిటీలో వేయడం ఏమిసబబు? ప్రకాశంగారు కాని, జైళ్ళనుంచి వచ్చిన యితర కాంగ్రెసునాయ కులుగాని, గత మూడుసంవత్సరాలుగా ఆంధ్ర దేశంలో ఏమి జరిగిందో నిజం తెలసికోవా లని కోరుతున్నారా? అందుకు ఒకటే సవ్య మైన మార్గముంది.

కర్తవ్యం

ఆంధ్ర కాంగ్రెసు పెద్దలు ఆంధ్ర కమ్యూ నిస్టు నాయకులతో కలసికొని, ముఖాముఖిని సంప్రదించాలి. గత మూడేండ్లుగా ఆంధ్ర ప్రజలలో కమ్యూనిస్టులు ఏమిచేశారో, బయట వున్న కాంగ్రెసు అంసెబ్లీ ముతావారు ఏమి చేశారో విచారణచేసి రిపోర్టుచేయడానికి ఒక నిష్పాక్షిక సంఘాన్ని నియమించాలి. ఈ సంఘసభ్యులు రెండుపార్టీల నాయకులచేత అంగీకరింపబడినవారుగా వుండాలి. ఆకమిటీ ఆంధ్రదేశమంతా తిరిగి ఎవరు ప్రజలకు ద్రోహం చేశారో, ఎవరు ప్రజలకు సేవ చేశారో ప్రజలమంది సాక్ష్యాలను తీసుకో వాలి. దొంగవ్యాపారం ఎవరు సాగించారో, దెబ్బలాటలు ఎవరు తెచ్చారో తెలసికోవాలి. అపుడు సత్యం బయటపడుతుంది. న్యాయం జరుగుతుంది. దేశభక్తులందరం కలసి పని చేయడానికి అవకాశం ఏర్పడుతుంది.

అంతేగాని ప్రకాశంగారు యిపుడు సూచించిన పద్ధతి సరియైనదికాదు. బాపినీడు, పేర్రాజులాంటి వార్లకు కమ్యూనిస్టుల చర్య లను విచారించడానికి తగిన తాహతు, హుందా కూడ లేదు. అట్టివారి రిపోర్టుకు ప్రజలు యెట్టివిలువ యివ్వరు.

ప్రకాశం, పట్టాభిగారిలాంటి ఆంధ్ర కాంగ్రెసు పెద్దలు ఒక విషయం గమనిం చాలి. 1942 ఆగస్టు ఉద్యమంలో మీరుకూడ పొరపాటు పడ్డారు. ఆ వుద్యమం సరికాదని ప్రపంచచరిత్ర రుజువుచేసింది. నేడు ప్రపంచ మంతటా ప్రజలు విజయం పొందుతున్నారు. మీ పొరపాటువలన మనం ఓడిపోయాము. ఈ సంగతి గుర్తించితే మన భవిష్యత్కార్య క్రమం వేసికోడం సులభమవుతుంది. అలా చేయాలని ఆంధ్ర కాంగ్రెసు పెద్దలకు మా విన్నపం.

అలాచేయక పాతవుద్యోం ఉపయోగించు కొని ప్రజలను బుకాయించాలనిచూస్తే మీకూ శ్రేయస్కరంకాదు; మన ప్రజలకూ క్షేమం కాదు. చూచారా! మీరు ఒక్క బుకాయిం పును సర్దుకోడానికి (మిగతా 11 పేజీలో)

ఆసియా చరిత్రలో నూతన శకారంభం

(2 వ పేజీ తరువాయి) చైతన్యవంతులయిన ప్రజలకు ఆయుధాలివ్వండి . జపానుమూకలను ముప్పతిప్పలుపెట్టి తరిమిగొడతారని విజ్ఞప్తి చేసింది. కాని ప్రభుత్వం ఈ సలహా నవలంబించలేదు. అలా చేయక విదేశప్రభుత్వాల సహకారం కోసం ఎదురుచూడసాగింది. కాని, మొదటినుంచీ చైనాకు శక్తికొలది సాయంచేస్తూ వచ్చింది ఒక్క సోవియట్ యూనియనే. 1941 లో జపానుతో తాటస్థ్య ఒడంబడిక చేసుకున్న తరువాత కూడా సోవియట్ ఈ సహాయం అందజేస్తూనే వచ్చింది. కాని, బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సుల వైఖరిఏమిటి? హాంకాంగు నుంచి చైనాకుఆయుధాలను పంపకూడదని 1940 లో ఛేంబర్లేను ప్రభుత్వం ఒక ఉత్తరువు జారీ చేసింది. ఆ తరువాత చర్చిల్ ప్రభుత్వం బర్మారోడ్డును కొంత కాలం మూసివేసింది. అమెరికా వర్తకులు జపాను యుద్ధపరిశ్రమలకు కావలసినసరుకు నంతా ఎగుమతి చేస్తూంటే, చూస్తూ ఊరుకుంది అమెరికా ప్రభుత్వం. అయినప్పటికీ కొమింటాంగు ప్రభుత్వం వీరిమీదనే ఆశలు పెట్టుకు కూర్చుంది. ఎప్పటికయినా వచ్చి సాయంచేస్తారని నమ్ముతూ వచ్చింది.

ఈ నమ్మకం బలంతోనే ఆ ప్రభుత్వం తిరిగి ప్రజాస్వామ్య వ్యతిరేక పోకడలను ప్రారంభించింది. నానాటికీ ప్రజాస్వామ్య సూత్రాలు ప్రజల్లో నాటుకుపోవడమూ, ప్రజా ఉద్యమాలు బలపడడమూ చూచి కొమింటాంగు పాలకవర్గంలో ఉన్న అభివృద్ధి నిరోధకులు బెదరిపోయారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. 1940లో ఈ ప్రభుత్వం కమ్యూనిస్టు ప్రదేశాలచుట్టూ తిరిగి మాటువేసింది. తన సేనలో మణిపూస లనదగిన దళాలను ఆయుద్ధరంగంనుండి మరలించి, అక్కడ కాపుదలపెట్టింది. కమ్యూనిస్టు సేనలపలుకుబడికిందవున్న గెరిల్లా ప్రాంతాలకు చీపురుపుడకంత సాయమైనా చేయ నిరాకరించింది.

మిత్రరాజ్యాలపై జపానుదాడి

జపాను పూర్తిగా ఓడిపోవడం విదేశీప్రభుత్వాలకు మొదట్లో ఇష్టంలేకపోయింది. ఫాసిస్టు జపానువల్ల తమ కెలాంటి ముప్పురాగలదో, వారూహించలేదు. ప్రమాదాన్ని గుర్తించక పసిఫిక్కు రంగంలో తమ ఆయువుపట్టులకు కూడా తగిన రక్షణ లేకుండా వదిలారు. సోవియట్ వ్యతిరేకత వాటికళ్లు కప్పింది.

1941 డిసెంబరు 7 వ తేదీని జపాను హటాత్తుగ మిత్రరాజ్యాలపై విరుచుకుపడింది. పసిఫిక్కు రంగంలో పెనుతుపానులా చెలరేగింది. అమెరికా, బ్రిటిష్ వలస దేశాలు పండుటాకుల్లాగ రాలిపోయాయి. చూస్తుండగానే జపాను ఆస్ట్రేలియా తీరాలవరకు వచ్చేసింది. 1942 లో బర్మా పడిపోయింది. ఇండియా సరిహద్దుమీదికి చేరుకున్నాయి జపాను సేనలు. ఇండియాలో నాజీజర్మనీతో చేతులుకలపడానికి ఎదురుచూడసాగాయి.

జపాను విజృంభణం బ్రిటిష్, అమెరికన్ ప్రభుత్వాలకు అప్పుడుగాని నెత్తికెక్కలేదు. అప్పుడు అమెరికా అరువు కవులు సౌకర్యాలను చైనాకుకూడా వర్తింపజేసింది. దాని ప్రకారం చైనాకు ఆయుధసామగ్రిని పంపసాగింది. ఆరోజుల్లోకూడ సింగపూర్ రక్షణకు చైనావారు తమ సేనలను పంపుతామంటే, బ్రిటిష్‌వారు అక్కరలేదన్నారు. బర్మా రక్షణకు వస్తామంటే, పరిస్థితులు చేయిజారిపోయిన తరువాతనే రానిచ్చారు. చైనా సాయంలేకుండానే యుద్ధం సాగించాలని వారి ప్లాను.

ఆలస్యానికి కారణం

ఈ పరిస్థితుల్లో ఇండియా, బర్మా మొదలయిన దేశాల ప్రజల సానుభూతి పొంది, చైనా గెరిల్లాదళాలకు కావలసినంత ఆయుధ సామగ్రిని పంపి, పరస్పర సమన్వయబుద్ధితో ఎదురుదాడికి సన్నాహాలు చేసినట్లయితే, విజయం త్వరలో లభించేది. కాని బ్రిటన్, అమెరికాలు తద్వ్యతిరేకపంథా నవలంబించాయి. యూరపుయుద్ధం ముగిసేంతవరకు జపానుపని వాయిదావేశాయి. తమ మిలిటరీ బలంపైనే ఆధారపడి, ప్రజల సహకారాన్ని తృణీకరించాయి.

చైనాలో కొమింటాంగు ప్రభుత్వంకూడ దీని కనుగుణ్యమైన పోకడనే పోయింది. అరువుకవులు ఏర్పాటుమీదవచ్చిన యుద్ధ సామగ్రిలో ఒక్క తుపాకినయినా గెరిల్లా సేనలకివ్వలేదు. అన్నీ తన సేనలకే ఉంచుకొంది. అంతేకాదు. తన సేనలను యుద్ధరంగంలోకి పంపవవసరం లేకుండానే, మిత్రరాజ్యసేనలే తనకు విజయం సాధించపెడతాయనీ, యుద్ధానంతరం కమ్యూనిస్టులపని పట్టడానికి తన సేనలను నిలువవుంచవచ్చుననీ- కొమింటాంగు పాలకవర్గం ఊహించసాగింది. ఇలాంటి ధోరణి అంతిమ విజయసాధనకు ప్రమాదకరమని కమ్యూనిస్టుపార్టీ తూర్పారబట్టింది.

ఈ హెచ్చరికను అమెరికావారు పెడచెవిని పెట్టారు. కమ్యూనిస్టుసేనలక్కూడా ఆయుధాలివ్వాలి - అని వాదించిన జనరల్ స్టిల్‌వెల్‌ని చెంగ్-కై-షేక్ ఒత్తిడికి లొంగి తొలగించింది అమెరికాప్రభుత్వం. అప్పటినుంచి అమెరికావారు చైనాలోబాహాటంగానే కమ్యూనిస్టువ్యతిరేక వైఖరిని, అభివృద్ధి నిరోధక ధోరణిని, అవలంబించసాగారు. చైనా జాతీయైక్యతను విచ్ఛిన్నం చేయ సమకట్టిన శక్తులకు చేయూత నివ్వసాగారు.

ఈరాజ్యాలన్నీ మొదటినుంచీ ఈవిధమైన ధోరణి అవలంబించడంవల్లనే త్వరలో లభించగల విజయం నేటికిగాని లభ్యంకాలేదు.

జపానుసామ్రాజ్యపు తొత్తులు

ఈలోగా జపాను తనసామ్రాజ్యాన్నిబాగా విస్తరించుకుంది. బర్మాను, ఫిలిప్పైన్స్‌ను, స్వతంత్రరాజ్యాలుగ ప్రకటించింది. "ఆసియా ఆసియా వాసులకే" అంటూ, "అఖండ ఆసియారాజ్యం"అంటూ - ప్రచారం తీవ్రం చేసింది. భారతీయులతో సహా, ఆసియా వాసుల నందరినీ తన బుట్టలో వేసుకుందామని దీని ఆశయం. అంతేకాదు. మిత్రరాజ్యాలలో చీలికలుతెచ్చి, తన స్థితిని నిరపాయం చేసుకోవాలని కూడా చూచింది. కాని, ఎంత మేకతోలు కప్పుకున్నా, తోడేలు తన కోరలను దాచుకోగలదా? ఆక్రమిత దేశాల ప్రజలు ఫాసిస్టు జపాను పైశాచిక స్వభావాన్ని క్రమక్రమంగా రుచిచూచారు. ఆరంభంలో జపానుతో చేతులు కలిపిన వారే తరువాత రహస్యంగా జపానువ్యతిరేక ఉద్యమం నిర్మింపసాగారు. బర్మా ఇందుకు ఉదాహరణం. ఎప్పుడుమిత్రసేనలు వస్తాయా - ఈపిశాచం చేతుల్లోనుంచి ఎప్పుడు విముక్తి పొందుతామా అని ఎదురుచూడసాగారు.

ఎదురుదాడి

1943 నాటికిగాని మిత్రరాజ్యాలు ఎదురుయుద్ధాలు ప్రారంభించలేదు. ఆ సంవత్సరం ఫిబ్రవరిలో గ్వాడాల్‌క్వెనాల్ దీవిని అమెరికా సేనలు తిరిగి ఆక్రమించుకున్నాయి. అప్పటినుంచి ఒక్కొక్క దీవిగా, క్రమక్రమంగా, జపాను ఆక్రమించుకున్న దీవుల్ని తిరిగి తీసుకున్నాయి. 1945 ప్రారంభంనాటికి ఫిలిప్పైన్సు, ఇవోజిమా, ఒకినావా దీవుల్ని వశపరచుకుంది. ఈ దీవుల ఆక్రమణతో జపాన్ సరిగద్ద అమెరికా విమానాలకు అందుబాటులోకి వచ్చింది. నిత్యనైవేద్యంగా జపాన్‌మీద బాంబులు కురవసాగాయి.

1944 లో బ్రిటిష్‌సేనలు అస్సాంని శత్రునిశ్శేషంచేసి, బర్మాను విముక్తిచేయడం ప్రారంభించాయి.

తా నాక్రమించుకున్న దేశాలన్నిటినీ నిలబెట్టుకోవడం అసాధ్యమని ఫాసిస్టుజపాను గుర్తించింది. పైగా తనకొక భుజంగా నిలిచిన నాజీ జర్మనీ పతనమవుతోంది. ఇక ఆత్మరక్షణ వ్యూహం పన్న నారంభించింది జపాను. ఆటు మిత్ర సేనలను ప్రతిఘటిస్తూ, ఇటు మంచూరియాను బలపరచుకోసాగింది. మంచూరియానుండి దీర్ఘకాలం మిత్రరాజ్యాలను ప్రతిఘటించాలని జపానుఎత్తు. ఈలోగా వాటిలో విభేదాలు పెరుగుతాయనీ, ఇటు కొమింటాంగు రెచ్చగొట్టే అంతర్యుద్ధాల ఫలితంగా చైనా తిరిగి నిర్వీర్యమవుతుందనీ; అప్పుడు ఆ రాజ్యాలతో తనకు అనుకూలమైన ఒడంబడికలను కుదుర్చుకోవచ్చుననీ దాని ఊహ. ఈ ఊహకు గొడ్డలిపెట్టుపెట్టింది సోవియట్ యూనియన్.

సోవియట్ పాత్ర

మొదటినుంచీ సోవియట్ యూనియన్ తన ఫాసిస్టు వ్యతిరేకతను సుస్పష్టంచేస్తూ వచ్చింది. సోవియట్ పత్రికలు, ప్రముఖులు జపానుయొక్క ఫాసిస్టు స్వభావాన్ని బట్టబయలుచేస్తూ వచ్చారు. పడమట ముంచుకొస్తున్న జర్మన్ ప్రమాదాన్నెదుర్కోడానికి 1941 లో జపానుతో తాటస్థ్య ఒడంబడికను చేసుకొన్నా, చైనా స్వాతంత్ర్య పోరాటానికి చేయూతనివ్వడం మానలేదు.

1944 లో నవంబరు దినోత్సవ సందర్భములో ఉపన్యసిస్తూ మార్షల్ స్టాలిన్ జపాన్ని దురాక్రమణచేసే దేశంగా పేర్కొన్నాడు. అప్పటికింకా తాటస్థ్య ఒడంబడిక రద్దుకాలేదు. ప్రపంచంలో ఫాసిస్టు దురాక్రమణను అంతమొందించ కంకణం కట్టుకున్న సోవియట్ యూనియన్ నాయకుడు స్టాలిన్ అలా అన్ననాడే పసిఫిక్కులో సోవియట్ పాత్ర స్పష్టమయింది ఈసంవత్సరం ఏప్రిల్ 5వ తేదీని సోవియట్ ప్రభుత్వం జపానుతో తాటస్థ్య ఒడంబడికను రద్దుచేసింది. మరొక నెల రోజుల్లో జర్మనీ ఓడిపోయింది. విముక్తి పొందిన యూరప్‌అంతా ప్రజాస్వామ్య స్థాపనకు పునాదులు వేసింది సోవియట్. ఇక పసిఫిక్కువైపు చూపుతిప్పింది.

మార్షల్ స్టాలిన్ చైనాప్రధాన మంత్రితో దీర్ఘసమాలోచనలు జరిపారు. ఈసమాలోచనలు ప్రారంభమయిన ఒక నెలరోజులకే ఆగష్టు 8వ తేదీని సోవియట్ ప్రభుత్వం జపానుమీద యుద్ధం ప్రకటించింది. ఈప్రకటన జరిగిన 36 గంటల్లోనే జపాను శరణోహం అన్న స్థితికి వచ్చింది.

యూరప్‌యుద్ధంలో సోవియట్ పొందినంత ధనప్రాణ నష్టాన్ని మరేదేశమూపొందలేదు. అయినప్పటికీ ఆయుద్ధం ముగిసిన మూడుమాసాల్లోనే సోవియట్ మరోఫాసిస్టు రాజ్యంపై యుద్ధం ప్రకటించింది. ఈత్యాగానికికూడా సోవియట్ ఎందుకు సిద్ధపడింది. యుద్ధప్రకటనను చేస్తూ మొలటావ్ ఇలా అన్నాడు: "ఇలా చేయడంవల్ల త్వరలో శాంతి చేకూరుతుంది. ప్రపంచ ప్రజలను అనవసర రక్తపాతంనుండి, కష్టాలనుండి కాపాడగలుగుతాము."

ఈ మహదాశయంతోనే సోవియట్ ఈ యుద్ధంలో కూడా ప్రవేశించడానికి వెనుకాడలేదు.

ఒకవైపు సోవియట్‌యూనియన్ మరోవైపు సామ్రాజ్యవాద పాలకవర్గాన్ని పడగొట్టిన బ్రిటన్. ఇంకోవైపు పోట్స్‌డమ్ ప్రణాళికపై ఈరెండు దేశాలతోపాటు సంతకం చేసిన అమెరికా. ఇంకోవైపు చైతన్యవంతులైన చైనా ప్రజానీకం. ఈనాలుగు శక్తులూకలసి పసిఫిక్కులో విజయధ్వజాన్ని నెలకొల్పుతాయి. పసిఫిక్కు చరిత్రలో నూతన, ప్రజాస్వామిక శకానికిది నాంది అవడానికి సందేహంలేదు.

(10 వ పేజీ తరువాయి) అనేక అబద్ధాలు అడవలసి వస్తుంది.

ఇంతేకాదు: నేడు ప్రపంచంలో ఎక్కడైనా చూడండి: కమ్యూనిస్టులపై ఎవరు వ్యతిరేకధ్వజం ఎత్తుతున్నారో గమనించండి: కమ్యూనిజానికి వ్యతిరేకులుగా బయలుదేరిన వారంతా ప్రజావిరోధులుగా తయారవుతున్నారు. ప్రజలచే ఓడింపబడుతున్నారు. మొనగాడననే ధీమాతో సోషలిజంపైని దుమ్మెత్తిపోసినన చర్చిల్‌గతి ఏమయిందో కండ్లారా చూస్తున్నాము. కమ్యూనిస్టులపై కక్షతో మీరాతప్పు చేయవద్దు. నిజం తెలిసికోవడం, ప్రజాసేవ చేయడం మీ కోర్కె అయితే పైన సూచించినట్లుగా చేయండి; కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ అందుకు సిద్ధమే. డాక్టరు పట్టాభిగారికి కామ్రేడ్ సుందరయ్యా యీ విషయమై ఆగష్టు ఒకటవ తేదీన స్పష్టంగాతెలిపారు. కాని పట్టాభిగారు చర్చించడానికే అంగీకరించలేదు. ఇప్పటికీ కమ్యూనిస్టునాయకులు అలాంటి సంప్రదింపులకు సంసిద్ధమే. కాంగ్రెసు పెద్దలు నిదానంగా ఆలోచించుతారని ఆశించుతాము.



జపాను కిరాతకుల వాతబడిన చైనా శిశువు



ముష్కర జపానీయులు స్త్రీల నిలా చిత్రవధ చేశారు.



బందీలయిన జపాను దుండగీండ్రు



హతమారిన జపాను దోపిడిగాండ్రు



విజయోత్సాహులైన అమెరికన్లు



విజయోత్సాహులైన చైనా యోధులు

Editor : M. Chandrasekhara Rao, Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwad

END OF ISSUE